మోదీ నాలుగేళ్ల దుష్పరిపాలన

# ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్థం

ప్రచురణ

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), ఆంధ్రప్రదేశ్ కమిటీ

27-13-3, సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ కార్యాలయం, ఆకుల వారి వీధి,

గవర్నర్‌పేట, విజయవాడ - 2, ఫోన్ నెం. 0866 2577202, 9490098042

**ప్రథమ ముద్రణ** : జూన్, 2018

వెల : ₹ 20/-

**ప్రతులకు**

PSBH

**ప్రజాశక్తి బుక్‌హౌస్**

27-1-54, కారల్‌మార్క్స్ రోడ్, గవర్నర్‌పేట,

విజయవాడ -2, ఫోన్ : 0866 -2577533

**బ్రాంచీలు**

విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, కాకినాడ,

ఏలూరు, విజయనగరం, ఒంగోలు, నెల్లూరు, కర్నూలు, అనంతపురం

**ముద్రణ**

ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, విజయవాడ

website : www.psbh.in

prajasaktipublishinghouse@gmail.com

135310

# విషయసూచిక


| | | |
|---|---|---|
| ❖ | ముందుమాట | 5 |
| ❖ | నాలుగేళ్ల మోడీ పాలన – సీతారాం ఏచూరి | 10 |
| ❖ | స్కీముల లాభాల కన్నా ప్రచారాలు మిన్న | 16 |
| ❖ | ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్థం | 23 |
| ❖ | లాభాల వేటగాళ్లతో ప్రభుత్వం కుమ్మక్కయితే | 31 |
| ❖ | పకోడీలు అమ్ముకోవడమే గతి | 34 |
| ❖ | మోడీ పాలనలో మూడు పువ్వులు<br>ఆరు కాయలుగా వర్ధిల్లుతున్న అవినీతి | 37 |

# ముందు మాట

**ఈ** ప్రచురణలో మోడీ పాలనకు సంబంధించిన నాలుగు అంశాలను విడివిడిగా ముద్రిస్తున్నాము. 2015 లో మోడీ పాలన మొదలయిన నాటి నుంచి నేటి వరకూ పాలనలో లోపాలను ఎత్తిచూపుతూ వేసిన సీరీస్‌లో ఇది నాల్గవది.

ప్రజల సొమ్ముతో తన పాలన గురించి ప్రచారం చేసుకుంటున్న ఈ సందర్భంలో మోడీ నాలుగేళ్ళ పాలనను అంచనా వేయవలసిన అవసరం మరింత ఎక్కువగా ఉన్నది. ఈ మధ్యనే సమాచార హక్కుతో తెలుసుకున్న వివరాల ప్రకారం, వివిధ మాధ్యమాల ద్వారా మోడీ తన ప్రభుత్వాన్ని ప్రచారం చేసుకోవడానికి రూ. 4343.26 కోట్లు ఖర్చు చేసారు. భర్తలు చనిపోయిన స్త్రీలకు చెల్లించే పెన్షన్ ఒక రూపాయి కూడా పెంచడానికి తన దగ్గర సొమ్ములేదంటూ ప్రభుత్వం నిరాకరిస్తున్న పరిస్థితులలో ఇంత పెద్ద మొత్తం ప్రచారానికి ఖర్చుచేయడం వెగటు కలిగిస్తుంది.

"పేదల పక్షపాతి"గా ఎన్నో విజయాలను సాధించినట్టు, అట్టహాసంగా జరుపుకుంటున్న మోడీ నాలుగేళ్ళ పాలనాసంబరాలను కర్ణాటక యెన్నికల ఫలితాలు కొంత నీరుగార్చాయి.

## వాస్తవం ఏమిటి ?

నాలుగేళ్ళ పాలన గురించి అంచనా వేస్తూ సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మొదటి పుస్తకంలో, **ధనికులను మరింత ధనికులగా పెంచే ఒక నమూనాగా మోడీ నమూనా ఎందుకుందో తెలియచేసే ఆర్థిక, విధానపరమైన మౌలిక అంశాల గురించి వివరించారు.** రెండు కోట్ల ఉద్యోగాల మాటేమిటి? అత్యవసర సరుకుల ధరలు అదుపు చేస్తానన్న వాగ్దానాల సంగతేమిటి? జన్ధాన్ యోజన, ఉజ్జ్వల యోజన అనే మోడీ మార్క్ పథకాల అసలు రంగేమిటి? ఈ విషయాలన్నీ ఈ పుస్తకంలో ఉన్నాయి.

కనీవినీ ఎరగని రీతిలో ఈ కాలంలో పెరిగిన అసమానతలు మోడీ పాలనఅసలు స్వరూపానికి అద్దం పడుతున్నాయి. నిజానికి మోడీగారు తన మనసులోమాట (మన్‌కి బాత్) లో ఏనాడూ డబ్బు ప్రస్తావన (ధన్‌కి బాత్) తేలేదు. 2015 లో సామాజిక ఆర్థికసర్వే ఫలితాలను ప్రకటించినప్పుడు 75 శాతం గ్రామీణ కుటుంబాల నెలసరి ఆదాయం రూ. 5000/– కన్నా తక్కువగా ఉందని తేలింది. ఒక ఇంట్లో గనక ఐదుగురు సభ్యులు ఉన్నారని లెక్క వేసుకుంటే మనిషికి రోజుకి రూ. 33/– ఖర్చవుతున్నట్టు లెక్క తేలుతోంది. మరో వైపు క్రెడిట్ సుశి అంచనాల ప్రకారం మోదీగారి పాలనలో భారతదేశంలోని అత్యంత ధనికులుగా ఉన్న ఒక్క శాతం వద్ద పోగుపడిన సంపద పది శాతం పెరిగి 58 శాతానికి చేరుకుంది. అత్యంత ధనికులపై అతి తక్కువ పన్నులు వేయడం, వారి బ్యాంకు అప్పులను రద్దు చేయడం, కార్పొరేట్లకు రకరకాల రాయితీలివ్వడం, సబ్సిడీలివ్వడం వంటి చర్యల ద్వారా ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలమని తెలియచేస్తున్నది. ఎన్నికలకు ముందు మోడీ రహస్యంగా కార్పొరేట్లకు చేసిన ఈ వాగ్దానాలన్నీ అమలు చేసారు.

ఈ కాలంలో పాలకుల పంచన చేరిన వారి లాభాలు విపరీతంగా పెరిగి ఆశ్రిత పెట్టుబడి బాగా పెరగడాన్ని కూడా చూడగలం. అదానీ వ్యాపారమే ఒక మంచి ఉదాహరణగా చెప్పుకోవచ్చు. 2017 డిసెంబర్ నాటికి వారి సగటు నికర ఆస్తులు 124.6 % పెరిగాయి. క్రిందటి సంవత్సరం అత్యధిక లాభాలను ఆర్జించిన వారిలో ఆయన అందరికంటే పైన ఉన్నాడు. 2015–16, 2016–17 మధ్య కాలంలో బిజెపి ఆదాయం 81.18 %, రూ. 570 కోట్ల నుండి రూ. 1034.27 కోట్లకు పెరగడం యాదృశ్చికం కాదు.

కార్పొరేట్లు సులభంగా లాభాలను సంపాదించుకునేందుకు వీలుగా ప్రభుత్వం చేత రకరకాల విధానాలు రూపొందించడం, తత్ఫలితంగా పాలిత పార్టీకి విరాళాలు కుప్పలు తెప్పలుగా రావడం వెనక ఉన్న ఆంతర్యం లోతుగా పరిశీలించవలసిన అవసరం ఉంది. చెడు సంప్రదాయాల నుండి భారత దేశాన్ని విముక్తి చేస్తానన్న మోడీ వాగ్దానం వాస్తవంలో ఆ చెడు సంప్రదాయాలలో ఎలా తలామునకలుగా కూరుకుని పోయిందో ఈ పుస్తకంలోని ఒక భాగం తెలియచేస్తుంది.

రెండో పుస్తకం **ఆర్ఎస్ఎస్ కు చేసిన వాగ్దానాలు, అవి బాహాటంగా ప్రజలకు తెలియజేయక పోయినా, ఎలా అమలు చేసిందో తెలియచేస్తున్నది.** కిందటి సాధారణ ఎన్నికలలో మోడీ నాయకత్వానికి తన స్వంత పార్టీలో విబేధాలు ఏర్పడ్డప్పుడు ఆర్ఎస్ఎస్ ఆయనకు పూర్తిగా అండగా నిలబడింది. భారతదేశ ప్రధాని తన జీవితంలో అత్యధిక భాగం ఆర్ఎస్ఎస్ ప్రచారకుడుగా ఉన్న విషయం బహిరంగమే.. రాజ్యాంగాన్ని

రక్షిస్తానని ప్రమాణం చేయడానికి ముందే ఆయన ఆర్ఎస్ఎస్ లో తీసుకున్న ప్రమాణానికి, భక్తి గీతానికి కట్టుబడి ఉన్నారు. రెండో పుస్తకంలో మోడీ ప్రభుత్వం హిందూ రాష్ట్రం స్థాపించడానికి బహిరంగంగాను ఆంతరంగికంగాను తీసుకున్న చర్యలను గురించి చర్చించడం జరిగింది. ఈ పుస్తకం రాజ్యాంగంలో మౌలిక అంశాలైన లౌకిక స్వరూపం పైనా, మైనారిటీలపైనా, ప్రజాతంత్ర, స్వయంప్రతిపత్తి గలసంస్థలపైనా, సమాఖ్యపైనా ఎలా దాడులు జరిగాయో వివరించడం జరిగింది.

ప్రస్తుతం రాజ్యాంగంలో సమాఖ్యపై జరుగుతున్న దాడి, రాష్ట్రాల హక్కులను దిగజార్చడం, భారతదేశాన్ని ఒకే కేంద్రం కిందకి తేవాలన్న ఆర్ఎస్ఎస్ ఎజెండాలో భాగంగా గుర్తించబడడం లేదు. హిందీని దేశమంతా రుద్దాలనుకోవడం తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కొంది. కానీ ఆ ప్రయత్నాలు ఆగలేదు. ఇదివరకటి కేంద్ర ప్రభుత్వాలు రాష్ట్రాలపై పెత్తనం చేయలేదనికాదు. మోడీ ప్రభుత్వం అన్ని పూర్వపు రికార్డులను తిరగ రాసింది. 15వ ఆర్థిక సంఘానికి చేసిన సిఫారసులను చూస్తే ఈ విషయం స్పష్టంగా అర్థమవుతుంది. ఈ పుస్తకంలో కేరళ ఆర్థిక మంత్రి థామస్ ఇసాక్ 15 వ ఆర్థిక సంఘ సిఫారసులకు సంబంధించిన అన్ని అంశాలను గురించి వ్రాసిన ఒక వ్యాసం ఉంది. ఈ పుస్తకంలో కాశ్మీర్లోని పరిస్థితులకి సంబంధించిన వ్యాసం కూడా ఉంది. కాశ్మీర్ విషయంలో కేంద్ర ప్రభుత్వ విధానాల పూర్తి వైఫల్యం, అందుకు పర్యవసానంగా అక్కడి ప్రజలు పూర్తిగా వేరుపడిపోయిన వైనం తేట తెల్లంగా చెప్పబడింది.

నిజానికి పాలకులు దేశంలోని ఇతర ప్రాంతాలలో తప్పుడు జాతీయవాదం లేవనెత్తేందుకు కాశ్మీర్‌ని ఉపయోగించుకుంటున్నారు. భారత ప్రభుత్వం తన విదేశాంగ విధానంతో దేశాన్ని "ప్రపంచ శక్తిగా గుర్తించేటట్టు, గౌరవించేటట్టు" చేస్తామన్న వాదనను ఇందులో విశ్లేషించడం జరిగింది. భారత దేశ విదేశాంగ విధానాన్ని మోడీ వ్యక్తిగత సంబంధంగా దిగజార్చి విదేశాంగ విధానం రూపొందించడంలో ఏంతో అనుభవమున్నవారి అనుభవాలను కించపరచినందువలన విదేశాంగ విధానం ఆటుపోట్లకు గురై చిరకాల మిత్రులను స్నేహితులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది. మోడీ ప్రభుత్వం అంతకు ముందటి యుపిఎ నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం లాగానే దేశాన్ని అమెరికా జూనియర్ భాగస్వామిని చేసి ఘోరమైన విధానాలను తీవ్రంగా అమలుచేయడం ప్రారంభించింది. భారతదేశాన్ని అమెరికా వ్యూహాత్మక భాగస్వామిని చేసింది.

బిజెపి ఎన్నికల మేనిఫెస్టోలోగాని, ఆ తరువాత గాని ప్రజలలోని అనేక తరగతులకు, రైతులకు, కార్మికులకు, మహిళలకు, ముఖ్యంగా దళితులకు ఆదివాసీలకు

వివిధ రకాల వాగ్దానాలను చేసింది. ఈ మేనిఫెస్టో అందరికి విద్య, వైద్యం అందిస్తామని కూడా వాగ్దానం చేసింది. ఈ వాగ్దనాలు బిజెపి పరిపాలనకు మంచి రోజులు తెచ్చిపెట్టి ఉండేవి.

మూడు నాలుగు పుస్తకాలలో **ఈ వాగ్దానాలు వాటి అమలు గురించి ప్రస్తావించడం జరిగింది.** ఈ ప్రభుత్వ పాలనలో రైతుల ఆత్మహత్యలు పెరిగాయి. మోడీ ప్రభుత్వం ఉద్యోగులకు కొత్తగా ప్రవేశ పెట్టిన పరిమితకాల నియామకాలు కార్మికులను అవసరానికి తీసుకుని అవసరం తీరగానే తీసివేసే విధానాన్ని ప్రవేశ పెడుతుంది. ఈ పద్ధతిని యజమానులు ఎప్పటినుండో కోరుకుంటున్నారు. పార్లమెంటులో అతి పెద్ద ఏకైక పార్టీగా ఉండి కూడా మహిళా రిజర్వేషన్ బిల్‌ను తొక్కిపెట్టి మహిళలకు తీరని అన్యాయం చేసింది. ఈ ప్రభుత్వ హయాంలో దళితులూ ముందెన్నడూ లేనంతగా జీవనోపాధిని కోల్పోయారు. వారి ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసే తీవ్రమయిన దాడులను, ఎదుర్కొన్నారు. అటవీ అధికారాల చట్టంనీరుగార్చబడింది. తరతరాలుగా అడవినే నమ్ముకొని జీవిస్తున్న ఆదివాసీలు ఉన్న వారి స్థానాలనుండి తొలగించ బడుతున్నారు. ఆధార్ ప్రభుత్వానికి ఒక వరంగా మారింది. ఇది ప్రభుత్వం పేద ప్రజలకు అందవలసిన హక్కులు అందకుండా చేయడానికి ఒక ఆయుధంగా తయారయింది. ఈ రెండు పుస్తకాలూ బిజెపి పేదలకు అనుకూలమన్న వాదనను ఆధారాలతో సహా తప్పని రుజువు చేస్తాయి.

మోడీ ప్రభుత్వ విధానాల వైఫల్యాలు ఈ ప్రభుత్వ పాలన అంతం కానున్నదని సూచిస్తున్నాయి.

వామపక్షాలు అనుసరించబోయే ప్రత్యామ్నాయ విధానాలు చెప్పడం ఈ పుస్తకాల పరిధిలో లేదు. ఆ విధానాలకు సంబంధించిన సమాచారం కేరళ, బెంగాల్ త్రిపురలలోని వామపక్ష పాలనలో ఉన్న రాష్ట్రాలలో విరివిగా అందుబాటులో ఉండనే ఉన్నది. ఆసక్తి ఉన్నవారు వాటిని అధ్యయనం చేయవచ్చు. ఇప్పుడు కేరళ లో పినరయి విజయన్ నాయకత్వంలోని వామపక్ష ప్రజాతంత్ర ప్రభుత్వం రెండో వార్షికోత్సవం జరుపుకుంటున్నది. ఈ ప్రభుత్వం తన ఎన్నికల వాగ్దానాలను చాలా వరకు అమలు జరిపి ప్రజాకేంద్రంగా అభివృద్ధి జరగడానికి ఒక నమూనాగా నిలిపింది. వివిధ కారణాల వలన ఎన్నికలలో ఓడిపోయినప్పటికీ మాణిక్ సర్కార్ త్రిపురని ఎన్నో సామాజిక సూచికలలో అగ్రభాగాన నిలిపారు. అంతకు ముందు పశ్చిమ బెంగాల్‌లో వామపక్ష ప్రభుత్వం భూ సంస్కరణలు అమలుచేసి, పంచాయత్ వ్యవస్థను పటిష్ట పరచి చరిత్ర సృష్టించింది. ఈ ప్రభుత్వాలు వివిధ తరగతుల ప్రజల మధ్య సామరస్యాన్ని పెంచి పురోగమనాన్నీ సాధించాయి. అందువలననే బిజెపి – ఆర్ఎస్ఎస్

వామపక్షాలను తమ సైద్ధాంతిక శత్రువులుగా పరిగణిస్తాయి. వారి విష ప్రచారానికి విభజించి పాలించే తత్వానికి అడ్డంకిగా భావిస్తాయి.

ఈ నాడు ప్రజాస్వామ్యాన్ని, సోషలిజాన్ని, ప్రజల హక్కులను కాపాడడానికి అవసరమయిన ప్రత్యామ్నాయ విధానాలకు, ప్రత్యామ్నాయ రాజకీయాలకు వామపక్షాలు ఛాంపియన్స్‌గా ఉన్నాయి. పైన చెప్పిన కారణాల రీత్యా బిజెపి – ఆర్‌ఎస్‌ఎస్‌ల విధానాలను సవాలు చేస్తూనే వామపక్ష ప్రజాతంత్ర శక్తుల మధ్య ఐక్యతను సమీకరణ బలాన్ని పెంచుకుని భారతదేశానికి భారత ప్రజలకు అవసరమయిన ప్రత్యామ్నాయ కార్యక్రమాన్ని అభివృద్ధి చేసుకోవలసిన అవసరం ఉంది. ఈ పుస్తకాలను రూపొందించడానికి అనేకమంది కామ్రేడ్స్ ఎంతో శ్రమించారు. సవేరా, శ్యాం, ప్రాంజల్, సోనాలి, ప్రబీర్ పూరకాయత్స్య, రాజేంద్ర శర్మ, బాదల్ సరోజ్, సుభాషిణి అలీ, విజూ కృష్ణన్, రఘు, వెంకటేష్ ఆత్రేయ, జుబిన్ డెన్నిస్, అజయ్ కుమార్‌లకు ధన్యవాదాలు.

ఈ పుస్తకానికి కార్టూన్లు గీసిచ్చిన

కార్టూనిస్టులకు కూడా ధన్యవాదాలు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడడానికి, రానున్న రోజులలో ఎదురయ్యే సవాళ్ళను ఎదుర్కోడానికి ఈ పుస్తకం ఉపయోగ పడుతుందని ఆశిస్తున్నాను.

**బృందా కరత్**

**మే 2018**

# నాలుగేళ్ల మోడీ పాలన

– సీతారాం ఏచూరి

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో గత నాలుగేళ్లుగా కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం సాధించిన ఏకైక ఘన కార్యం, 2014 ఎన్నికలలో గెలిచేందుకు వాగ్దానాలు చేసి వాటి ఆధారంగా మెజారిటీ సాధించి, ప్రభుత్వాన్ని ఏర్పరచి, ఆ వాగ్దానాలలో దాదాపుగా ఏ ఒక్కటి నెరవేర్చకపోవడమే.

దేశానికి "మంచి రోజులు" వస్తాయని మోడీ వాగ్దానం చేసారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత గత ఏడు దశాబ్దాలుగా ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పథంలో దేశం నడుస్తుందని సరికొత్త స్థాయిని అందు కుంటుందని వాగ్దానం చేసారు."అందరితో అందరికోసం అభివృద్ధి" సాధించబడుతుందని హామీ ఇచ్చారు. ఈ అన్ని వాగ్దానాలు గాలి మాటలు గానే మిగిలాయి.

గత నాలుగేళ్లుగా ప్రజల జీవనమేకాక, భారత దేశం ఒక దేశంగానే తీవ్రమయిన దాడులను ఎదుర్కొంది. ప్రతిరోజూ నలుమూలల నుండి దాడులు పెరుగుతూనే పోతున్నాయి.

**అ.** నయా ఉదారవాద ఆర్థిక సంస్కరణలు తీవ్రంగా అమలుచేయడం వలన అసంఖ్యాక ప్రజల జీవనం నాశనం అయిపోయింది.

**ఆ.** మత విభేదాలు పెంచి పోషించడం వలన ప్రజలు మత ప్రాతిపదికన విడిపోయి సమాజం అట్టడుగునుండి కూడా చీలికలు పేలికలయింది .

**ఇ.** పార్లమెంట్ ప్రజాస్వామ్యం, సంస్థలు నిత్యం దాడులు ఎదుర్కొంటున్నాయి.

**ఈ.** భారతదేశ స్వతంత్ర విదేశాంగ విధానం పూర్తిగా అమెరికా సామ్రాజ్య వాదులకు పాదాక్రాంతం చేయబడింది.

ఈ నాలుగు రకాల దాడులు భారత దేశంపైన, దేశ ప్రజల పైన తీవ్రమయిన ప్రభావాన్ని చూపిస్తాయి.

ఈ నాలుగేళ్ళ మోడీ పాలన, భారదేశ, భారత ప్రజల భవిష్యత్తు సురక్షితంగా ఉండాలన్నా, అభివృద్ధి చెందాలన్నా ఈ ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిందే అన్న విషయాన్ని నిర్ధారించింది.

## ప్రజలపై ఆర్థిక దాడులు

భారతదేశ ఆర్థిక వ్యవస్థ ఆర్థిక మూలాలను నోట్ల రద్దు, జిఎస్‌టి లు రెండు కలిపి పూర్తిగా చిన్నాభిన్నం చేసాయి. ఈ రెండు ఎంతగా మన ఆర్థిక కార్యకలాపాలను దెబ్బ తీశాయంటే ఈ రోజుకీ మనం అంతకు ముందున్న ఆర్థిక స్థితిని అందుకోలేక పోయాము. భారతదేశంలో అసంఘటిత రంగం స్థూల జాతీయోత్పత్తిలో 50% వాటా కలిగి ఉంది. వ్యవసాయం తరువాత అత్యధిక సంఖ్యలో ఉద్యోగాలు కల్పించేది కూడా ఇదే. ఇది ఈనాడు విచ్ఛిన్నం అయింది. జిఎస్‌టి దాని అమలు పరిచిన విధానం భారత దేశంలోని చిన్న సన్నకారు మధ్య తరగతి పరిశ్రమల నడ్డి విరగ్గొట్టింది. ఇవే ఈ దేశంలో అత్యధికులకు ఉపాధి కల్పించేవి. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ప్రతి రంగంలోను అనుమతిస్తున్నారు. అంటే చిల్లరవ్యాపారంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి దొడ్డిదారిలో ప్రవేశించిందన్నమాట. దేశంలో చిల్లర వ్యాపారం నాలుగు కోట్ల మందికి ఉపాధి కల్పిస్తుంది. చిల్లర వ్యాపారంలో బహుళ జాతి కంపెనీలు అడుగు పెట్టడం వలన దేశ జనాభాలో ఐదోవంతు ప్రజానీకం, నష్టపోతారు. ఈ మధ్య కాలంలో అంతర్జాతీయ చిల్లర వ్యాపార సంస్థ–వాల్మార్ట్, ఫ్లిప్ కార్ట్‌ను కొనడంతో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి భారతదేశంలోకి రావడం చట్టబద్ధమయింది. వ్యవసాయ సంక్షోభం ప్రమాదకర పరిస్థితులలో ఉంది. గ్రామాలలో నిజ వేతనాలు జీవనాధారానికి అవసరమయిన దానికన్నా తగ్గిపోయాయి. పెట్టుబడులకు ఒకటిన్నర రెట్లు మద్దతు ధరను చెల్లిస్తానన్న ప్రభుత్వం తన ఎన్నికల వాగ్దానం నుంచి వెనక్కి మళ్లింది. రుణ భారం మోయలేక లక్షలాది రైతులు ప్రాణాలు తీసుకుంటున్నారు. రైతుల రుణమాఫీని ప్రభుత్వం అంగీకరించడం లేదు గాని లక్షల కోట్ల రూపాయల కార్పొరేట్ అప్పులను

మాఫీ చేస్తున్నది. స్వదేశీ విదేశీ కార్పొరేట్ల లాభాలను పెంచేందుకు అవసరమయిన అన్ని చర్యలు తీసుకుంటూ దేశంలో అసమానతలను పెంచుతున్నది. ధనికులు ధనికులవుతుంటే పేదలు నిరుపేదలవుతున్నారు. 2017 లో పెరిగిన సంపదలో 73% ఒక్క శాతం జనాభా చేతిలోకి పోయింది. ఆశ్రిత పెట్టుబడిదే పెత్తనంగా ఉంది. కార్పొరేట్లు తీసుకున్న అప్పులలో, ముఖ్యంగా జాతీయ బ్యాంకుల నుండి తీసుకున్న అప్పులలో 11 లక్షల కోట్ల రూపాయలు చెల్లింపులు కాలేదు. మౌలికమయిన ప్రతి ఆర్థిక సూచి దిగజారుడునో, స్థిరంగా ఉండడాన్నో సూచిస్తున్నది. అందువలన గడిచిన నాలుగేళ్లు దేశ ప్రజలు తమ జీవన పరిస్థితులు అంతకంతకూ దిగజారడమే చూసారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వలన అత్యంత నీచమయిన ఆశ్రిత పెట్టుబడి ఒక వైపు ఎదుగుతుంటే, నానాటికి పెరుగుతున్న భారాలతో ప్రజల జీవనం మరో వైపు దిగజారుతున్నది.

## మతతత్వ కేంద్రీకరణ

అత్యంత వైవిధ్య భరితమయిన, గొప్ప సంస్కృతులు గల మన దేశ ప్రజలను మూసపోతగా మార్చే ప్రయత్నం నిరంతరం జరుగుతున్నది. ఇందువలన దళితులు, మైనారిటీపై దాడులు పెచ్చురిల్లుతున్నాయి. ఉత్తర ప్రదేశ్‌లో గోరక్షకుల పేరుతో, రోమియో వ్యతిరేకత పేరుతో (యాంటీ రోమియో) ప్రైవేటు సైన్యాలు తయారయి యువకులు ఏం తినాలో, ఏం ధరించాలో ఎవరితో స్నేహం చేయాలో శాసిస్తున్నాయి. మితవాద చీడపురుగు మానవత్వాన్ని తొలిచి వేస్తున్నది. ఈ మధ్య జరుగుతున్న అత్యాచారాలు, హత్యలు దీనినే తెలియచేస్తున్నాయి.

## ఉన్నత చదువులపైనా పరిశోధనలపైనా దాడులు

సమాజంలోని మానవత్వంతో పాటు హేతుబద్ధత, తార్కికత పైనకూడా దాడులు జరుగుతున్నాయి. ఉన్నత చదువులు, పరిశోధనలు కూడా మతతత్వం ఆధారంగా రూపొందించబడుతున్నాయి. దేశ చరిత్రను పురాణాల ఆధారంగా తిరిగి రాసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ రకంగా ప్రజల ఆలోచనలను భారతదేశాన్ని లౌకిక ప్రజాతంత్ర సర్వసత్తాక రాజ్యాంగం కలిగిన దేశాన్ని అసహనంతో కూడిన మితవాద, ఫాసిస్ట్ “హిందూ రాష్ట్రం”గా మార్చాలని ఆర్ఎస్ ఎస్ నిరంతరం ప్రయత్నాలు చేస్తున్నది . దీనివలన ఈనాడు మనందరికీ తెలిసిన భారతదేశం ధ్వంసం

అవుతుంది. "అందరితో" అభివృద్ధి అన్న నినాదం నినాదంగానే మిగిలి, నాలుగేళ్లలో హిందూత్వ దాడులు పెరగడం వలన పెద్ద ఎత్తున దళితులూ, మైనారిటీ మతస్తులు దేశంలోనే పరాయివారుగా బతుకుతున్నారు.

## అందరికీ అభివృద్ధి ఫలాలు ?

గత నాలుగేళ్లుగా కేంద్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెట్టె ఖర్చులు క్రమంగా తగ్గడం చూస్తున్నాము. మోడీ విద్యకు స్థూల జాతీయోత్పత్తిలో 6% కేటాయిస్తానని వాగ్దానం చేశారు. కానీ వాస్తవంలో 2014-2015లో స్థూల జాతీయోత్పత్తిలో ఆరోగ్యానికి కేటాయింపులు. 0.55% ఉన్నది కాస్త 2018-2019కి 0.45% నికి దిగజారింది. కేంద్ర బడ్జెట్‌లో శాతంగా చూసుకున్నా, 2014-15 లో బడ్జెట్‌లో4. 1 % ఉండగా 2018-19కి 3.6 శాతానికి పడిపోయింది. వాగ్దానాలను పక్కన పెట్టి, "స్వచ్ఛ భారత్" అని భారతదేశమంతటికీ పారిశుద్యం, స్వచ్ఛమైననీరు అందిస్తున్నట్టు డంబాలకు పోతున్నది. నిజానికి జరుగుతున్నది తత్‌విరుద్ధంగా ఉన్నది. 2014-15లో జాతీయ గ్రామీణ తాగునీరు కార్యక్రమానికి రూ. 10,892 కోట్లు వెచ్చించగా 2018-19 లో రూ.7000 కోట్లు మాత్రమే కేటాయించారు. అంటే 35% నిధులు తక్కువుగా కేటాయించారు. 2015-16 ఎన్ ఎస్ఎస్ ఓ సర్వే ప్రకారం స్వచ్ఛ భారత్ పథకం కింద కట్టిన మరుగుదొడ్లలో పదింట ఆరు మరుగుదొడ్లకు నీటి సౌకర్యం లేదు. ఈ ప్రచారాలు కూడా మిగిలిన వాటిలాగే పటాటోపానికి, ఆర్భాటానికే పరిమిత మయ్యాయి. అలాగే గ్రామీణ ఉపాధికి కేటాయింపుల విషయంలో కూడా. ఎస్సి, ఎస్టిల సబ్ ప్లాన్ విషయం మరీ ఘోరం. బడ్జెట్లలో వీటి కేటాయింపులు ఏమాత్రం సరిపోవు.

## పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పై దాడి

గత నాలుగేళ్లుగా అన్ని పార్లమెంట్ ప్రజాస్వామ్య సంస్థలు తీవ్రమయిన దాడులను ఎదుర్కొంటున్నాయి. ప్రభుత్వం పైన పార్లమెంటుకి ఏరకమయిన అదుపూ లేకుండా పోయింది. ప్రభుత్వాన్ని జవాబుదారిగా చేయలేక పోతున్నది. మున్నెన్నడూ కనీవినీ ఎరుగనివి జరుగుతున్నాయి. అవిశ్వాస తీర్మానం చర్చకు అనుమతించబడలేదు. ఎన్నో పర్యవసానాలు ఉండే బిల్లులు కూడా రాజ్యసభను దాటి వేయడానికి ద్రవ్య బిల్లులుగా ప్రవేశ పెట్టబడుతున్నాయి. ఎలక్షన్ కమిషన్ వంటి రాజ్యాంగబద్ధ సంస్థల

పని కూడా ప్రశ్నార్థకంగా తయారయ్యాయి. ఇదివరకు ఎలక్షన్ కమిషనర్‌గా పనిచేసినాయన ఇప్పటి ఎలక్షన్ కమిషనర్ తన నిజాయితీని ప్రజల ముందు నిరూపించుకో మనడం ఇందుకు ఒక ఉదాహరణ. అన్ని పరిశోధన సంస్థలు ప్రభుత్వం అజమాయిషీలోనే పనిచేస్తున్నాయి. అర్థబలం, అంగబలం, ప్రదర్శించి, భయపెట్టడంతో బిజెపి గోవా, మణిపూర్, మేఘాలయ ఆ తరువాత బీహార్‌లలో ప్రభుత్వాలను ఏర్పాటు చేయగలిగింది. జవాబుదారీ అవినీతి రహిత ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తానన్న మోడీ వాగ్దానం వాగ్దానంగానే మిగిలిపోయింది. ప్రధాన మంత్రి తన ప్రభుత్వం అవినీతిని అంతం చేసేందుకు కట్టుబడి ఉందని ప్రకటనలు చేస్తూనే ఉంటారు. డిసెంబర్ 2013లో పార్లమెంట్‌లో లోక్‌పాల్, లోకాయుక్త చట్టం పాస్ అయి, 2014 జనవరిలో నోటిఫికేషన్ వచ్చినా ఈనాటి వరకు అమలుకు మాత్రం నోచుకోలేదు. 2016లో ప్రభుత్వం కొన్ని సవరణలు చేసి అవినీతి నిరోధక చట్టాన్ని నీరుగార్చింది. ది విజిల్ బ్లోయర్స్ ప్రొటెక్షన్ యాక్ట్ (అవినీతిని హెచ్చరించే వ్యక్తుల రక్షణకు ఉద్దేశించిన చట్టం) అమలు కాలేదు. ఫలితంగా అవినీతిని హెచ్చరించిన వారు తమ ప్రాణాలను ఫణంగా పెట్టవలసి వచ్చింది. మోడీ ప్రభుత్వం గ్రీవెన్స్ రిడ్రెసల్ బిల్‌ని తిరిగి ప్రవేశ పెట్టలేదు. సమాచార హక్కు చట్టం సవరణలకు గురిచేయబడింది. కేంద్ర సమాచార కమిషన్‌లో ఉన్న 11 మందిలో నలుగురి స్థానాలు భర్తీ చేయలేదు. ప్రధాన కమిషనర్‌తో సహా మరో నలుగురు 2018లో రిటైర్ కానున్నారు. అంటే ప్రభుత్వం సమాచార హక్కును నీరుగార్చాలని ప్రయత్నిస్తున్నట్టుగానే అర్థం చేసుకోవలసి ఉంటుంది.

మోడీ ప్రభుత్వం వాస్తవానికి రాజకీయ అవినీతికి, రాజకీయ పార్టీలకు నిధులను సమకూర్చే విధానానికి తీవ్రమయిన సవరణలు చేయడం ద్వారా చట్టబద్ధత కల్పించింది. ఎలక్టోరల్ బాండ్స్ ను ప్రవేశ పెట్టడం ద్వారా మోడీ ప్రభుత్వం ఎన్నికల నిధులు సమకూర్చుకోవడంలో మరింత పారదర్శకంగా ఉండేటట్టు చేసేబదులుగా మరింత మరుగున ఉండే పద్ధతులను ప్రవేశ పెట్టింది. ఈ రాజకీయ పార్టీలకు నిధులను సమకూర్చుకునే బిల్‌లో మార్పులు కూడా రాజకీయాలలో ముఖ్యంగా ఎన్నికల వేళలలో ధన బలం పెద్ద ఎత్తున వినియోగించుకునే వీలు కల్పించే విధంగా, ఆర్థిక బిల్‌గా దొడ్డిదారిలో ప్రవేశ పెట్టబడింది.

## నాలుగేళ్ళ అనుభవం

బిజెపి ప్రభుత్వం ఓడిపోయితీరాలి. అన్నిరకాలుగా, ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన వాగ్దానాలను భంగం చేయడమే కాకుండా, పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేసి, సర్వసత్తాక లౌకిక, ప్రజాతంత్ర రూపాన్ని కించపరిచి, ప్రజల జీవన పరిస్థితులపై దాడులకు తెగబడిన మోడీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేకమయినది. రాజ్యాంగ వ్యతిరేకమయినది. ఈ అన్ని కారణాల వలన మరెన్నో ఇతర కారణాల వలన కూడా మోడీ ప్రభుత్వం చివరి సంవత్సరంలో వేలాదిగా తమ నిరసనను తెలియ జేస్తూ, మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపడమే భారత ప్రజల ప్రధాన లక్ష్యంగా ఉండాలి.

♦

# స్కీములు – లాభాలకన్నా ప్రచారాలు మిన్న

మోడీ ప్రధానమంత్రి అయిన తరువాత ప్రత్యేకంగా తన ముద్రగా చెప్పుకునే అనేక పథకాలు, స్కీములు ప్రవేశపెట్టబడ్డాయి. వాటిని గనుక నిశితంగా పరిశీలిస్తే ప్రచార పటాటోపం ఎక్కువగాను వాగ్దానాలు నిలబెట్టుకోవడంలో గాని, లక్ష్యాలను చేరుకోవడంలోగాని తక్కువగాను ఉన్నట్టు స్పష్టమవుతుంది. మోడీ మార్క్‌గా చెప్పబడే జన్ ధన్ యోజన, ముద్రా రుణాల నుండి స్వచ్ఛ భారత్, ఉజ్వల, స్కిల్ ఇండియా వరకు అన్నిటి గతి ఇదే. ఈనాడు ఇవి ప్రభుత్వం చేసిన మోసాలకు ఉదాహరణలుగా నిలిచాయి.

ఈ అన్ని స్కీములలోను ఒక లక్షణం ఉంటుంది. గొప్పవాగ్దానం, పెద్ద ఎత్తున ప్రచారం, హ్రస్వదృష్టి, తప్పుడు విధానం తప్పుదారి పట్టించే గణాంకాలు,లక్ష్యాలు, చివరగా కీలకమయిన గుణాత్మక విషయాలలో దేశ భవిష్యత్తును పణంగాపెట్టిన వైనం. క్లుప్తంగా చెప్పుకోవాలంటే ఇవి మోడీగారి కార్యాచరణ రాహిత్యానికి ప్రతిరూపాలు. తన వైఫల్యాలను వాగాడంబరంతో కప్పిపుచ్చే ప్రయత్నం చేయడంగా కనిపిస్తుంది.

## ప్రధాన మంత్రి ఉజ్వల యోజన

ఇది గ్రామీణ నిరుపేద మహిళలు బొగ్గులు, కట్టెలతో వంట చేసుకుని ఆరోగ్యాలు పాడుచేసుకోకుండా గ్యాస్ పొయ్యి పొందే స్కీము. గ్రామీణ మహిళల ఆరోగ్యాలు మెరుగుగా ఉండాలన్నది లక్ష్యం. 2018 ఏప్రిల్ నాటికి 3.5 కోట్ల మందికి ఈ పథకం వర్తింపచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇది మోడీ ప్రభుత్వం అతి పెద్ద విజయంగా చెప్పుకోవడం జరిగింది. కానీ వాస్తవాలు ఏమిటి?

2015లో ప్రభుత్వం ఈ పథకం అమలుచేయడానికి అవసరమయిన సర్వే చేయమని అడగడం జరిగింది. కానీ సర్వే ఫలితాల కోసం ఎదురుచూడకుండానే 2016 మే నెలలో మోడీ ప్రభుత్వ మూడేళ్ళ పాలనను పురస్కరించుకుని స్కీం అమలు చేయడం మొదలు పెట్టారు. అయితే సబ్సిడీలు ఇచ్చే విధానం వలన అయితేనేం అమలులో లోపాలవలన అయితేనేం ఈ స్కీం ప్రచారం జరిగినంతగా అమలుకు నోచుకోలేదు.

ఈ స్కీం కింద ప్రభుత్వరంగ గ్యాస్ కంపెనీకి ప్రభుత్వం రూ.1600/- ఇస్తుంది. లబ్ధిదారుడు రూ.1500/- స్టవ్ కోసం, సిలిండర్ కోసం చెల్లించాలి. ఒకేసారి చెల్లించలేని వారికి ప్రభుత్వం 4 లేక5 వాయిదాలలో చెల్లించే అవకాశం ఇచ్చింది. దీనిని గ్యాస్‌కి ఇచ్చే సబ్సిడీలో మినహాయించుకుంటారు. అంటే నిజానికి కేవలం కనెక్షన్ మాత్రమే ఉచితం గ్యాస్ సిలిండర్‌కి, పొయ్యికి లబ్ధిదారుడే చెల్లించుకోవాలి. 85% ప్రజలు వాయిదాలలో గ్యాస్ కనెక్షన్ తీసుకునేందుకు ముందుకొచ్చారంటేనే గ్యాస్ కనెక్షన్ కోసం వచ్చే ప్రజలు ఆర్థికంగా తూగలేకపోతున్నారని అర్థం అవుతుంది.

14.2 కిలోల గ్యాస్ సిలిండర్‌పై వచ్చే సబ్సిడీ రూ. 200/- నుండి రూ. 300/- వరకు ఉండవచ్చు. అందువలన రూ. 1500/- గ్యాస్ పొయ్యికి సిలిండర్‌కి ఇవ్వవలసినది ఇవ్వాలంటే కనీసం 7 సిలిండర్లు పొందే సమయం కావాలి. అంటే ఆ నెలలన్నీ లబ్ధిదారులు సిలిండర్ పూర్తి పైకం ఇచ్చి తీసుకోవాలి. గత మూడేళ్లకాలంలో సబ్సిడీ సిలిండర్ ధర 20% పెరిగింది! ఇంత ధర పెట్టి ఏ పేద కుటుంబం గ్యాస్ సిలిండర్ కొనుక్కోగలదు?

అందువలన గ్యాస్ కనెక్షన్లు ఈ స్కీం పెట్టినప్పటి నుంచి 16% పెరిగినా సిలిండర్లు కొనేవారు 9% పెరిగారు. ఇది స్కీం మొదలుపెట్టిన 2014-15 కంటే తక్కువ. ప్రభుత్వం గ్యాస్ సిలిండర్లు జిల్లా, బ్లాక్ పరిధులలో లేదా గ్రామీణ పట్టణ ప్రాంతాలలో ఏ రకంగా ఉపయోగించబడుతున్నాయో తెలుసుకునే గణాంకాలు ఇచ్చేందుకు నిరాకరించిన కారణంగా తెలుసుకోలేకపోయాము.

వాస్తవ పరిస్థితులు చూసినప్పుడు సిలిండర్ ఖర్చు భరించలేక, సిలిండర్ అందుబాటులోకి రావడం కష్టమయి, పర్యవేక్షణ లోపాల కారణంగా చాలామంది తిరిగి పూర్వ పద్ధతులలోకి మారిపోయారు. అంటే తిరిగి కర్రలు, బొగ్గులు వాడకం మొదలు పెట్టారు. ఫలితంగా మహిళల ఆరోగ్యం బాగుండాలని మొదలయిన పథకం

తన లక్ష్యం చేరకుండానే నిలిచిపోయింది.

## ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన

భారత ప్రజలను ఆర్థికంగా పరిపుష్టులను చేసేందుకు ప్రవేశపెట్టిన ఒక విప్లవాత్మకమయిన పథకంగా దీనిని చెప్పుకున్నారు. సేవింగ్స్ అకౌంట్‌లు ఉన్నవారికి కొత్త ఖాతాలు ఇవ్వడం వరకే దాని ప్రయోజనం పరిమిత మైందని అర్థం అవుతున్నది. ఈ మధ్యనే వచ్చిన ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం 48% ప్రజలు గత 12 నెలల కాలంలో ఒక్కసారి కూడా తమ బ్యాంకు ఖాతాలను ఉపయోగించలేదు. నిరుపయోగంగా ఉన్న బ్యాంకు ఖాతాలు గల దేశాలలో భారతదేశం అగ్రస్థానంలో ఉన్నది. ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ ప్రచురించిన ఒక పత్రం ప్రకారం ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన ఖాతాలలో 17% సున్నా డబ్బులున్న ఖాతాలే. అలాగే ఈ ఖాతాలలోసరాసరిగా రూ. 2500/– మించి ఉన్నది లేదు. నోట్ల రద్దు కాలంలో మాత్రమే ఈ జీరో అకౌంట్ ఖాతాలలో డబ్బులు పడ్డాయి. ఈ అకౌంట్లు నోట్లను మార్చుకోడానికే ఉపయోగపడ్డాయన్న ఆరోపణకి ఇంతవరకు ఎవరూ సరైన సమాధానం చెప్పలేకపోతున్నారు.

ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన బ్యాంకు అకౌంట్లను మాత్రమే వాగ్దానం చేయలేదు. ఈ పథకం వలన ఇతర ప్రయోజనాలు – ఖాతాలో ఉన్నదానికన్నా ఎక్కువ తీసుకునే సౌకర్యం(Over draft), బీమా కూడా ఇమిడి ఉన్నాయి. 2017 డిసెంబర్ నాటికీ ఖాతాదారులతో కేవలం 1% మందే ఖాతాలో ఉన్న దాని కన్నా రూ 5000/–ఎక్కువ తీసుకునే సౌకర్యం పొంది ఉన్నారు. జీవిత బీమా సౌకర్యం కేవలం 4200 మంది పొందారు. ఈ ఫలితాలను పరిశీలిస్తే ప్రచారం జరిగినంతగా పని (ఆర్థికంగా ఇముడ్చుకోవడం) జరగలేదని అర్థం అవుతుంది.

## స్వచ్ఛ్ భారత్ అభియాన్

ప్రధానమంత్రికి ఇష్టమయిన స్కీం స్వచ్ఛభారత్ కూడా కేవలం ఫొటోలు తీసుకునే అవకాశం గల స్కీముగాను, అంకెల గారడీ గల స్కీం గానే ముగిసిపోయింది. 2014 అక్టోబర్‌లో ఈ స్కీం మొదలయినప్పుడు 2019 అక్టోబర్ 2 నాటికి భారతదేశం బహిరంగమలవిసర్జన లేని దేశంగా ఉండాలని లక్ష్యం పెట్టుకున్నారు. (ఓడిఎఫ్). కానీ ఇప్పటికి 8 రాష్ట్రాలు రెండు కేంద్ర పాలిత ప్రాంతాలు మాత్రమే ఓడిఎఫ్‌గా

ప్రకటించుకున్నాయి. తమనితాము ఓడిఎఫ్‌గా ప్రకటించుకున్న రాష్ట్రాలలో సహితం బహిరంగ మలవిసర్జన నిరాటంకంగా జరుగుతూనే ఉన్నది. ఇందుకు నరేంద్రమోడీ గారి రాష్ట్రం గుజరాత్‌నే ఉదాహరణగా చెప్పుకోవచ్చు. అందువలన గణాంకాలను నమ్మలేకుండా ఉన్నాము. ఇదే రకమయిన రిపోర్టులు రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మధ్య ప్రదేశ్ నుండి కూడా వస్తున్నాయి. అదేసమయంలో 2018–19 బడ్జెట్‌లో ఈ స్కీం కింద ఇచ్చే నిధులు తగ్గించి వేయబడ్డాయి. కేవలం రూ. 1400/ – కోట్లు మాత్రమే కేటాయించబడ్డాయి. అదేసమయంలో మరోవైపు మానవ మలం మానవులు చేతులతో ఎత్తే పని కొనసాగుతూనే ఉన్నది. దానికి బలవుతున్నది దళితులే. ఒక్క 2017లోనే నిషేధించేబడిన ఈ పని చేస్తూ 300 మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. కేవలం రూ. 20 కోట్లు మాత్రమే ఈ యూనియన్ బడ్జెట్‌లో దళితుల ప్రత్యామ్నాయ జీవనం ఏర్పాటు చేసుకునేందుకు చేయవలసిన సహాయం కింద కేటాయించబడింది. ఈ అమానుష కార్యాన్ని అంతం చేయడానికి కావలసిన యాంత్రీకరణకు కేంద్రం ప్రత్యేక నిధులు ఏమీ కేటాయించలేదు. నరేంద్రమోడీ ముఖ్యమంత్రిగా ఉన్న రోజులలో రాసిన ఒక పుస్తకంలో మానవ మలినాలు ఎత్తిపోయడం వాల్మీకి కులస్తులకు ఒక ఆధ్యాత్మిక అనుభవంగా రాసిన సంగతి ఈ సందర్భంగా మనం గుర్తుచేసుకోవాలి. "వారి పూర్వీకులకు చేసేందుకు వేరే ఏ ప్రత్యామ్నాయం లేదా వ్యాపారం దొరకలేదని నమ్మడం అసంభవం".

ఈ లోగా స్వచ్ఛ భారత్ అభియాన్ బలవంతంగా చేయిస్తున్నట్టు వార్తలు వినవస్తున్నాయి. ఈ మధ్యనే పుదుచ్చేరి గవర్నర్ ప్రజలు వారి గ్రామంలో బహిర్భూములు లేవని, పరిశుభ్రంగా ఉన్నాయని సర్టిఫై చేస్తేగాని ఉచిత రేషన్ ఇవ్వద్దని ఆజ్ఞ జారీచేశారు. అదే రకంగా బిజెపి పాలిట రాష్ట్రాలలో బెదిరింపులు సాగుతున్నాయి, ఆహారం నిరాకరించబడుతున్నది. మల విసర్జన బహిరంగంగా చేసే వారి ఫొటోలు ప్రచురిస్తామని బెదిరిస్తున్నారు. డ్రోన్లు కూడా ఇందుకు ఉపయోగిస్తున్నారు. ఈ విషయమై జరిగిన ఘర్షణలో ఒకరు మరణించినట్టు కూడా వార్త వచ్చింది. ఇటువంటి బలవంతాల వల్లే తప్పుడు రిపోర్టులు ఇవ్వవలసి వస్తున్నది. ఫలితంగా వాస్తవం మరుగున పడుతుందేకాని పరిష్కరించబడదు. గత సంవత్సరం ఆగస్టు ప్రభుత్వం 48% గ్రామాలలో బహిరంగ ప్రదేశాలలో మల విసర్జన జరగడం లేదని అన్నా ఆ విధంగా సర్టిఫికెట్ ఇవ్వలేదని చెప్పింది. (దేశ వ్యాప్తంగా వాడని

టాయిలెట్స్ అసంఖ్యాకంగా ఉండడం ఈ స్కీం కూడా, తక్కిన వాటిలాగానే అర్ధవంతమయిన జోక్యం చేసుకుని పరిశుభ్రత సౌకర్యాలు పెంచే దిశగా కాకుండా కేవలం సంఖ్యలు చెప్పుకోడానికే, ప్రచారాస్త్రంగానే మిగిలిపోయిందా అనే ప్రశ్న ఉదయిస్తుంది).

## ముద్ర రుణాలు

మోడీ ప్రధాన మంత్రి ముద్ర యోజన అనే పథకం ద్వారా ఎక్కువ మందికి వేగంగా రుణాలు మంజూరు చేస్తే ఎక్కువ మందికి స్వయం ఉపాధి దొరుకుతుందని తద్వారా ఆర్థిక రంగం పుంజుకుంటుందని ఎంతో ప్రేమతోనే అయినా తప్పుడు ఆశతో ప్రారంభించారు. రాజకీయంగా ఒత్తిడి తీసుకుని రావడం వలన ప్రభుత్వ రంగ బ్యాంకులు గాని, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలుగాని, మైక్రో క్రెడిట్ ఇండియా ద్వారా గాని 2015-16 లో ఒక్కొక్క దరఖాస్తు దారునికి గరిష్టంగా రూ. పది లక్షల వరకు ఏ హామీలుగాని ఇతర నియమ నిబంధనలుగాని లేకుండా రుణాలు మంజూరు చేయాలని, ఆవిధంగా 9.9 కోట్ల మందికి రూ 4.68 లక్షల కోట్లు రుణాలు మంజూరు చేయాలని ఆజ్ఞలు జారీ చేసారు.

అంటే ఒక్కొక్కరికి రూ. 47,249/- కేటాయించబడ్డాయన్నమాట. ఏ వ్యాపారమయినా ఇంత తక్కువ మొత్తం పెట్టుబడిగా పెడితే సమర్ధవంతంగా కొనసాగగలుగుతుందా - కేవలం పేమెంట్లపై పకోడీలు అమ్ముకుంటేనో, చిల్లర వ్యాపారాలు చేసుకుంటేనో తప్ప? అయినా, బిజెపి ప్రభుత్వం చిల్లర వ్యాపారులను చిన్న వ్యాపారులను ఇబ్బంది పెట్టకుండా వదలడం లేదుకదా! ప్రధాన మంత్రి మొన్న పకోడాల వ్యాపారం కూడా వ్యాపారమే అనడంలో ఉద్దేశం ఇదే కాదు కదా! నిజానికి బిజెపి ప్రభుత్వ విధానాల వలన చిల్లర వ్యాపారాలు తీవ్రమైన నష్టాలకు గురవుతున్నారు.

అస్థవ్యస్తంగా అమలవుతున్న ఈ స్కీం మరో పార్శ్వం మొన్నీమధ్య బయటపడింది. ఓ బ్యాంకు ఆఫీసర్ని సిబిఐ మోసానికి పాల్పడ్డాడని అరెస్ట్ చేసింది. ఆయన ఈ పద్దు కింద 26 మందికి రూ. 62 లక్షలు రుణం మంజూరుచేసే ముందు అసలు ఈ పెట్టుబడితో వ్యాపారం చేస్తున్నాడా లేదా అని ఏ విధమయిన తనిఖీలు చేయకుండా రుణాలు మంజూరు చేసాడన్నది అభియోగం. నిజానికి స్కీము రూపొందించడంలోనే ఈలోపం ఉంది. బ్యాంకులు పైనున్న రాజకీయ ఒత్తిళ్ల

కారణంగా లక్ష్యాలను చేరుకునేందుకు రుణాలను పంచి ఉండి ఉంటారు. కొంతమంది బిజెపి నాయకులు వారి మద్దతు దారులను పోగేసి వారి ప్రాపకం కోసం రుణాలు మంజూరు చేయించారు. ఇదేగనక నిజమయితే బిజెపి తన మద్దతుదారులకు డబ్బులు పంచడానికి ఈ స్కీము ని ఉపయోగించుకుందని అనుకోవలసి ఉంటుంది.

## స్కిల్ ఇండియా

ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన – భారతదేశంలో నైపుణ్యాభివృద్ధి – అన్నది మరో మోడీమార్క్ స్కీము. దీని ఉద్దేశం పరిశ్రమల అవసరాలకు అనుగుణమయిన నైపుణ్యాలను పెంపొందించడం. ఇది ప్రారంభించిన నాటి నుండి 41.3 లక్షల మందికి రకరకాల నైపుణ్యాలలో శిక్షణ నిచ్చింది. కానీ కేవలం 6.15 లక్షల మంది మాత్రమే ఉద్యోగాలు పొందారు. అంటే కేవలం 15%, మంది మాత్రమే ఉద్యోగాలు పొందారన్నమాట. రూ. 12,000 కోట్లు ఈ స్కిము కింద కేటాయించిన ఫలితమిది!

ఈ స్కీముని మొదటిసారిగా సమీక్షించిన శారద ప్రసాద్ కమిటీ, దీని ఫలితాలను అంచనా వేయలేదని చెప్పింది. ఈ స్కీముతో సంబంధం ఉన్న వారితో మాట్లాడి "ప్రతివాడు అంకెల వెంట పడుతున్నారేగాని యువకులకు ఉద్యోగాలు చూపడం లేదు. పారిశ్రామిక రంగాల అవసరాలకు తగ్గట్టుగా నైపుణ్యం పెంచడం లేదు". అని సెలవిచ్చింది. సంఖ్యకి ఇచ్చిన ప్రాధాన్యత శిక్షణ ఇచ్చిన వారిని ఏయే ప్రదేశాలలో ఇముడ్చుకోగలమో తెలుసుకోవడానికి ఇవ్వడం లేదు. మొదటి విడతలో రంగాల వారి నైపుణ్యం మండలులు ఏర్పాటు చేసి పిఎంకెవైవి పాఠ్యాంశాలను రూపొందించింది. శిక్షణ పూర్తయిన తరువాత వారికి సర్టిఫికెట్లను ఇచ్చింది. కానీ శిక్షణలో నాణ్యత లోపం, అంచనాలలో లోపాలు, సర్టిఫికెట్లను ఇవ్వడంలో లోపాలు జరిగాయని కమిటీ రిపోర్ట్ ఇచ్చింది. కమిటీ రిపోర్ట్‌లో "రూ. 2500 కోట్లు ప్రజాధనం ఖర్చయినా స్కీం ప్రధాన లక్ష్యాలయిన పరిశ్రమలకు అవసరమయిన సరైన నైపుణ్యాలను పెంచడంలోగాని యువతకు గౌరవప్రదమయిన జీతాలతో కూడిన ఉద్యోగాలు వచ్చేట్టు చూడడంలో గాని విఫలమయింది. కేవలం ప్రైవేటు రంగానికి ప్రయోజనం చేకూర్చే విధంగానే వనరులు ఉపయోగ పడ్డాయి" అని రిపోర్ట్ ఇచ్చింది. ఇది ఈ ప్రత్యేక పథకం దేశంయొక్క అవసరాలను అంచనా వేయడంలోఎంతగా విఫలమైందో సూచిస్తున్నది.

మోడీ ప్రభుత్వం చెప్పలేనన్ని స్కీములను రూపొందించడంలో ప్రత్యేకత సాధించింది. వాటిలో కొన్ని ముఖ్యమయిన స్కీములు ఎలా అత్యంత నికృష్టంగా విఫలమయ్యాయో ఇక్కడ చర్చించడం జరిగింది అదేసమయంలో గ్రామీణ ఉపాధి, ఐ సి డి ఎస్, మధ్యాన్నం భోజన పథకం, ఎం ఎహ్ ఎం లాంటి కీలకమయిన పథకాలు, ఉద్యోగం ఆరోగ్యం పిల్లల చదువులు కచ్చితంగా అందించే పథకాలు తీవ్రమయిన నిధులలేమికి నిరాదరణకు గురైయ్యాయి. నయా ఉదారవాద విధానాల చట్రంలో నలిగి పోయాయి. మోడీగారి లోప భూయిష్ట పరిపాలనంటే ఇదే.

♦

# ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్థం

2014లో ఎన్నికల సందర్భంగా బిజెపి ప్రచారంలోని ముఖ్యాంశం ఆర్థిక వ్యవస్థ అంతా యూపిఎ హయాంలో అస్తవ్యస్తమయింది–ఎదుగుదల లేదు, రూపాయి మారకం పడిపోయింది, ఎగుమతులు పెరగడం లేదు. పరిశ్రమలకు బ్యాంకులు ఇచ్చిన రుణాలు తిరిగి చెల్లించబడడం లేదుఅని. మోడీ వచ్చి తన మంత్ర దండంతో ఈ పరిస్థితులన్నీ మార్చేస్తారని ప్రకటించారు. భారతదేశం ప్రపంచంలోనే అతి వేగంగా అభివృద్ధి చెందే దేశంగా మారిపోతుందని, రూపాయి మారకం మెరుగుపడుతుందని, ఎగుమతులు పెరుగుతాయని, విదేశీ స్వదేశీ పెట్టుబడిదారులు దేశానికి ఎగిరివస్తారని, భారతదేశం ఒక పారిశ్రామిక హబ్‌గా మారిపోతుందని చెప్పారు. ఇవన్నీ జరిగినట్లయితే భారతదేశంలోని బ్యాంకులలో పారుబకాయిలన్నిటిలో చెల్లింపులు జరిగి ఉండేవి. వ్యవసాయం బాగుపడి ఉండేది. రైతుల ఆత్మహత్యలు తగ్గేవి. అన్నిటికీ మించి ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలను ఇవ్వగలిగి ఉండేది. ఉద్యోగాల సంగతి మరో చోట చర్చిద్దాం. అందుకని ప్రస్తుతం మిగిలిన విషయాల గురించి మాట్లాడుకుందాం.

ఇక్కడ మనం పరిశీలించాల్సింది ఈ ప్రభుత్వం ఆర్థిక రంగంలో తన 2014 ఎన్నికల సమయంలో తనకు ఉదారంగా సహాయం చేసిన కార్పొరేట్లకు తాను చేసిన వాగ్దానాలను అమలుచేయడం గురించి. మొదటి నుండి ఈ ప్రభుత్వం వ్యాపారం సులభతరం చేయడం అన్న అంశం పైనే ధ్యాస పెట్టింది. ఆ భ్రమలో కార్మికుల హక్కులను కాల రాసింది. కార్పొరేట్లు అపరిమితంగా దేశాన్ని దోచుకోవడాన్ని ఎవరు వ్యతిరేకించినా వారిని అభివృద్ధిని ఆటంక పరిచే వారిగా భావించింది. పర్యావరణాన్ని నాశనం చేస్తూ ఉంటే చూసీచూడనట్టు మిన్నకుంది. లక్షలకోట్ల రుణ బకాయిలు వసూలు కాకపోతే వాటిని రద్దు చేయడంలో సహకరించింది. విదేశీపెట్టుబడిదారులకు ఎర్రతివాచీ పరిచి ఆహ్వానించింది. ఎంతగా నయాఉదారవాద విధానాల అమలుకు

పూనుకుందంటే ఇదివరకు నయాఉదారవాద విధానాలకు కట్టుబడి ఉండి, వాటిని అమలు పరిచిన ప్రభుత్వాలు సహితం సిగ్గుతో తల దించుకునే పరిస్థితి ఏర్పడింది. వారందరికీ ఇవి మంచి రోజులే. ఈ నాలుగేళ్లలో స్థూల జాతీయోత్పత్తి, విదేశీ వ్యాపారం, రూపాయి విలువ మొదలయిన ఆర్థిక సూచికల వాస్తవ పరిస్థితి ఏమిటి? ఈ ప్రశ్నకు సమాధానం చెప్పడం కష్టం. ఎందుకంటే స్థూల జాతీయ ఉత్పత్తిని లెక్క కట్టే మౌలిక అంశాలను సమూలంగా మార్చి వేయడం జరిగింది. సరే, ఈ మార్పు సంగతిని పక్కన పెట్టి, ఈ మారిన గణాంకాలను పరిగణనలోకి తీసుకుని విశ్లేషించుకుందాం. ప్రభుత్వ లెక్కల ప్రకారమే స్థూల జాతీయోత్పత్తి మార్కెట్ ధరల ప్రకారం 2015-16లో ఉన్న 8.2% నుండి 2016-17 కి 7.1 శాతానికి ఆ తరువాతి సంవత్సరం అంటే, 2017-18కి 6.6 శాతానికి పడిపోయింది. ఇది ప్రపంచ ఆర్థిక పరిస్థితి కొంత ఆశాజనకంగా ఉన్న పరిస్థితులలో జరిగింది. ప్రపంచంలోని అన్ని దేశాలు అమెరికాతో సహా ఈ కాలంలో సంక్షోభం నుండి బయటపడి ఎంతో కొంత పుంజుకున్నాయి. చమురు ధరలు తగ్గుముఖం పట్టాయి. ఇంతటి అనుకూల పరిస్థితులలో భారతదేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచ మార్కెట్ ఉన్నత స్థాయిలో ఉండవలసింది. వేగంగా పెరుగుతూ ఉండవలసింది. కానీ ఆ రెండూ జరగలేదు.

భారతదేశ ఎగుమతులు 2014కి ముందున్న స్థాయికన్నా దిగజారాయి. 2013-14లో భారతదేశ వస్తు ఎగుమతులు $314.4 బిలియన్ల ఉండేవి. 2017-18 లో అధికారిక అంచనాల ప్రకారం $302.8 బిల్లియన్లు ఉండవచ్చని అంచనా. అదే సమయంలో దిగుమతులు $450.2 బిలియన్ల నుండి $459.7 బిలియన్లకు పెరిగాయి. అంటే వాణిజ్య లోటు $135.8 నుండి $156.8 బిలియన్లకు పెరిగింది. చమురు ధరలు ఇంత తక్కువగా లేకపోతే దిగుమతులు ఇంకా పెరిగి ఉండేవే. (చమురు ధరల తగ్గుదల వలన భారతదేశ పెట్రోలియం ఉత్పత్తుల ధరలు కూడా తగ్గాయన్నది నిజమే) కానీ ఎగుమతులు దిగుమతులలోని చమురేతర వస్తువులను గనక పరిగణించినట్టయితే, భారతదేశ చమురేతర ఎగుమతులు గత నాలుగేళ్లుగా 5.1% పెరిగాయి. అదే సమయంలో దిగుమతులు 22.8% పెరిగాయి. ఫలితంగా చమురేతర వాణిజ్యలోటు గత నాలుగేళ్లలో రెండున్నర రెట్లు పెరిగింది. $34. బిలియన్ల నుండి $86 6%బిల్లియన్లకు చేరింది. ఇప్పుడు చమురు ధరలు కూడా పెరుగుతున్నాయి. దీని వలన మోడీ పాలనలోని మిగిలిన సంవత్సర కాలంలో పరిస్థితి మరింతగా విషమించే అవకాశాలు ఉన్నాయి. అదెలాగంటే 2016-17 కి 2017-18 కి మధ్య కాలంలో వాణిజ్యలోటు 44..5% పెరిగింది. సేవల ఎగుమతులు

కొంత మేరకు లోటును పూడ్చగలిగాయి. ఈ రంగంలో కూడా మోడీగారి హయాంలో దిగజారుడు స్పష్టంగా కనిపిస్తుంది. భారతదేశ నికర సేవల ఎగుమతులు 2014-15 లలో ఉన్న $76.6% బిలియన్ల నుండి 2015-16కి $69.7 బిలియన్లకు, 2016-17కి $67.5% బిలియన్లకి పడిపోయాయి. ఆ తరువాతి సంవత్సర గణాంకాలు అందుబాటులో లేవు. ఈ పరిస్థితులలో రూపాయి విలువ పతనం అవుతుండడం, అమెరికా డాలర్‌తో దాని మారకం ఎన్నడూ లేనంత దిగువస్థాయిలోకి దిగజారడం ఆశ్చర్యాన్ని కలిగించదు. 2014 మేలో ఈ ప్రభుత్వం పరిపాలనను హస్తగతం చేసుకున్న నాటికి డాలర్ విలువ రూ. 59 ఉండగా ఇప్పుడు రూ. 68 ఉంది. 2016 ఫిబ్రవరి లో రూ. 68.8 కి చేరింది. ఈ స్థాయికి తిరిగి త్వరలో చేరుకునే అవకాశాలే ఉన్నాయి.

## మేక్ ఇన్ ఇండియా

మేక్ ఇన్ ఇండియా అనే నినాదం గురించి చూద్దాం. భారతదేశం చైనాను సవాలు చేస్తూ వస్తు తయారీ కేంద్రంగా మార్చాలన్న కల ఇంకా కలగానే మిగిలిపోయింది. ముందుకు అడుగు వేయనేలేదు. దేశీయ పారిశ్రామికాభివృద్ధి పరిస్థితి ఏమిటో చూద్దాం. అధికారిక లెక్కల ప్రకారమే ఇదికూడా ఒక పరాజయ కథే. పారిశ్రామిక ఉత్పత్తి సూచిక (ఐఐపి) 2014 మేలో 111. 0 ఉండగా 2018 మార్చి నాటికీ 139.0 కి చేరింది. అంటే సంవత్సరానికి సరాసరి అభివృద్ధి కేవలం 5.8% అన్నమాట. భారతదేశం 8% అభివృద్ధిని గనక కోరుకుంటే అత్యధిక భాగం పారిశ్రామిక రంగ అభివృద్ధి నుండి రావలసి ఉంది. అంటే పారిశ్రామిక అభివృద్ధి రెండంకెలకు చేరాలి. వాస్తవంగా జరిగిన అభివృద్ధి 5.8% అంటే మన లక్ష్యం ఎంతదూరంలో ఉందో గమనించాలి. నిజానికి ఐఐపి యొక్క ఉత్పత్తి రంగం సూచిక మరింత తక్కువగా ఉంది. ఇది గత నాలుగేళ్లలో 112. 2 నుంచి 138. 6కి పెరిగింది. అంటే సంవత్సరానికి 5.4 % పెరిగింది.

మేక్ ఇన్ ఇండియా అనే కార్యక్రమంతో, బయటికి చిల్లర వ్యాపారం లోకి అనుమతించలేదని చెపుతున్నా ప్రభుత్వం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ప్రతి రంగంలోనికి ఆహ్వానించింది. (ఈ కథ వాల్మార్ట్ ఫ్లిప్కార్ట్‌ని స్వాధీనం చేసుకున్నాడని బయట పడిన తరువాత ముగిసింది). రక్షణ రంగం లాంటి సున్నితమయిన రంగాలలో కూడా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి అనుమతించబడింది. కనీసం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి పెట్టాలంటే కొత్తగా ఒక పరిశ్రమలో పెట్టుబడి పెట్టవలసి ఉంటుందనే నిబంధన కూడా లేదు. బ్రవున్ ఫీల్డ్ పెట్టుబడి, అంటే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి భారత దేశం

లో ఇప్పటికే ఉన్న పరిశ్రమలలో విదేశీయులు వాటాలను కొనుక్కోవడాన్ని, 1991 నుండి అనుసరిస్తున్న నయాఉదారవాద విధానాలకు అనుగుణంగా భారత ప్రభుత్వం ఆహ్వానిస్తున్నది. ఇందువలన బహుళజాతి కంపెనీలు భారతదేశం లోని కొత్త కంపెనీలను స్వాధీనం చేసుకుంటున్నారు. (వాల్మార్ట్ – ఫ్లిప్కార్ట్ ఒప్పందం లాగా) కొత్తగా పెట్టుబడులు రాకపోవడంతో భారతదేశంలో ఉత్పత్తి చేయడంలో పెద్దగా ఎదుగుదల లేదు. స్వదేశ కంపెనీలే పెట్టుబడులు పెట్టడానికి ఆశక్తి చూపని పరిస్థితులలో బహుళజాతి కంపెనీలు భారతదేశంలో కొత్త పరిశ్రమలు పెట్టేందుకు పరుగులు తీయడం లేదన్నది ఏమాత్రం ఆశ్చర్యం కలిగించడం లేదు. రిజర్వు బ్యాంకు రిపోర్టు ప్రకారం గత సంవత్సరం రుణ పరపతి కేవలం 5% మాత్రమే పెరిగింది. ఇది గత 70 ఏళ్లలోనే కనిష్ఠ స్థాయి. మోడీగారెప్పుడూ చెప్పుకుంటున్నట్టు "డెబ్భైయి ఏళ్లలో జరగనిది ఇప్పుడు జరిగింది". ఈ ప్రభుత్వ పరిపాలన కాలం అంతా ఇదే ధోరణి కొనసాగింది. రుణ పరపతి ఎదుగుదల 2010–11 చివరి త్రైమాసికంలో 18.3% ఉండగా 2015–16 మొదటి త్రైమాసికానికి 9.2% నికి దిగజారింది. 2017–18 కి 5.9% పడిపోయింది.

భారత దేశంలో తయారు చేయాలన్న ఉన్న కాస్తంత ఉత్సాహం కూడా మోడీ గారి అత్యంత వినాశకర పెత్తందారీ పోకడతో అకస్మాత్తుగా చేసిన నోట్ల రద్దుతో నీరుగారిపోయింది. 2016 నవంబర్‌లో ప్రజల వద్ద నున్న 86% నోట్లురాత్రికి రాత్రి ఎందుకూ కొరగాకుండా పోయాయి. లక్షలాది మంది ఉపాధి కోల్పోయారు. వేలాది చిన్న పరిశ్రమలు మూతబడ్డాయి. ఆ దెబ్బ నుండి ఇప్పటికి ఆర్థిక వ్యవస్థ కోలుకోలేదని గణాంకాలు స్పష్టంగా తెలియజేస్తున్నాయి. నోట్ల రద్దు వందమందికి పైగా ప్రజల ప్రాణాలను ప్రత్యక్షంగా హరించింది. వేలాది కుటుంబాల ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తం చేసింది. చాలామంది ఆర్థిక వేత్తలు సూచించినట్టు, నోట్ల రద్దు స్థూలజాతీయోత్పత్తిని 2% దిగజార్చింది. 2017 మేలో జారీ చేయబడిన పశు వ్యాపార నిబంధనలతో మార్పులు ఇంతగా కాకపోయినా పశువులకు సంబంధించిన ఆర్థిక రంగంలో, మాంసం ఎగుమతుల వ్యాపారం గాని, చర్మం, చర్మంతో తయారయిన వస్తువుల ఎగుమతుల వ్యాపారాన్ని గానీ భారీగా దెబ్బతీసింది. దీని ఆర్థిక ప్రభావం భారతదేశం లోని గ్రామీణ ప్రాంతంలోని ముస్లిముల మీద, దళితుల మీద, ఎక్కువగా ఉంది. (ఈ నోటిఫికేషన్‌తో గోరక్షకుల స్వైర విహారంతో జరిగిన హత్యల మాట అటుంచినా). ఆ తరువాత ఏ మాత్రం ముందుచూపు, ప్రణాళిక లేకుండా అమలు చేసిన జిఎస్‌టి అమలు చిన్న వ్యాపారులకు, యజమానులకు కంటిమీద కునుకు లేకుండా చేసింది.

## పారు బకాయిలు

అయితే ఈ రకమయిన తప్పుడు పద్ధతులు అవలంభించడం వలన నష్టపోయినదెవరు? భారతదేశంలోని అతి శక్తివంతమయిన వ్యాపారులేమయినా నష్ట పోయారా? బ్యాంకులలో అప్పులు తీసుకున్న వారి కథలు బయట పడుతుండడంతో వాస్తవాలు స్పష్టంగా బయట పడుతున్నాయి. నష్టపోతున్నది వారు కాదు. ప్రజలు. ప్రజలు దోచుకోబడుతున్నారు. వాస్తవాలను పరిశీలిద్దాం. ఆర్‌బిఐ ప్రకటించిన ఒక పత్రంలో పారు బకాయిలు బ్యాంకులలో 2013 మార్చి నాడు ఉన్న 3.4 % నుంచి 2015 మార్చికి 4.7 %నికి పెరిగాయి. 2017 మార్చి నాటికీ 9.9 శాతానికి చేరాయి. 2018 నాటి గణాంకాలు ఇంకా అందుబాటులోకి రాలేదు. అయితే దొరికిన ఆధారాల మేరకు అవి ఇంకా పెరిగే సూచనలే ఉన్నాయి. అందులో మొదటిది 2017 డిసెంబర్ త్రైమాసికానికి బ్యాంకులు విడుదల చేసిన ఫలితాలు. అప్పటికి మొత్తం పారు బకాయిలు భయంకరమయిన స్థాయిలో, రూ.8.4 లక్షల కోట్లు ఉన్నాయని జనవరి రిపోర్టులు తెలియచేస్తున్నాయి. ఇందులో పారిశ్రామిక రంగం వాటా రూ. 6.1 లక్షల కోట్లు. అయితే  ఈ ప్రకటన వచ్చిన నాటికీ 20 బ్యాంకులే తమ ఫలితాలను ప్రకటించాయి. ఈ ఏడాది మార్చ్‌కి పారు బకాయిలు గత ఏడాది ఉన్న 7.2% నుంచి 8.3 శాతానికి పెరిగాయి. అంటే పరిస్థితి మరింత దిగజారుతున్నట్టే! పారు బకాయిలు అంటే తీసుకున్న అప్పులు తిరిగి చెల్లించక పోవడమే. కాని వాస్తవంగా బ్యాంకులకు నష్టాలు  వాటిల్లలేదని భ్రమలో ఉన్నట్టయితే ఈ క్రింది వివరాలు మీకు అసలు విషయాన్ని స్పష్టం చేస్తాయి. పార్లమెంటుకు ఆర్‌బిఐ సమర్పించిన గణాంకాల ప్రకారం 2012–13 నుండి 2016–17 మధ్య కాలంలో బ్యాంకులు రూ. 2.5 లక్షల కోట్లు రుణాలను రద్దు చేశాయి. ఇందులో అత్యధిక శాతం రుణాలు పారిశ్రామిక వేత్తలు తీసుకున్నవే. ఇందులోనూ రూ. 61,640 కోట్లు 2012–13, 2013–14 లోని యూపిఎ ప్రభుత్వ హయంలో రద్దు చేయబడ్డాయి. మోడీ ప్రభుత్వ  మొదటి మూడేళ్ళ కాలంలో 2014–15 నుండి 2016–17 మధ్య కాలంలో రూ.1,88,286 కోట్ల రుణాలు రద్దు చేయబడ్డాయి. అంతకంటే ఘోరం ఏమిటంటే ఈ మొత్తాలు ఏడాదికేడాది పెరుగుతూ పోవడం. 2014–15 లో రూ. 49,018 కోట్ల నుండి 2015–16 లో రూ. 57,585 కోట్లకు ఆ తరువాత 2016–17 లో రూ. 81,683 కోట్లకు, పెరుగుతూ పోయింది. ఒక్క స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా మాత్రమే రూ. 10,000 కోట్ల నష్టాన్ని గత రెండు త్రైమాసికాలలో చూపింది, అంటే 2017 అక్టోబర్ నుండి 2018 మార్చి వరకు.

పంజాబ్ నేషనల్ బ్యాంకు జనవరి మార్చి ఒక్క త్రైమాసికంలోనే రూ. 13,000 కోట్లు నష్టాలను నమోదు చేసింది. అంటే రెండు ప్రభుత్వ బ్యాంకులే ఆరు నెలల కాలంలో రూ 20,000 కోట్లకుపైన నష్టాలను చూపాయి.

ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఈ నష్టాల నిందను యూపిఏ పై మోపారు. ఇది వారసత్వంగా తమ ప్రభుత్వానికి వచ్చిందన్నారు. కొన్ని నష్టాలు వారసత్వంగా వచ్చి ఉండవచ్చు గాక. రుణాలు ఎగ్గొట్టిన వారిపై గట్టి చర్యలు తీసుకోకపోవడం కాక కార్పొరేట్లకు అనుకూలంగా రుణాలను తిరిగి మంజూరు చేసేందుకు బిజెపి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అందులోను కొంతమంది కార్పొరేట్లకు మరింత అనుకూలంగా వ్యవహరించింది. ఉదాహరణకు మోడీ సన్నిహితులు అయిన అద్వానీ గారి ఆధ్వర్యంలోని రెండు విద్యుత్ కంపెనీలకు రూ 15,000 కోట్ల రుణం ప్రభుత్వ రంగ బ్యాంకులే సమకూర్చాయి. (ఆ కంపెనీల పన్ను కట్టడానికి ముందు ఉన్న ఆదాయం, తీసుకున్న రుణాలపై కనీసం వడ్డీ కట్టడానికి కూడా సరిపోని పరిస్థితులలో ఈ రుణాలు మంజూరు చేయబడ్డాయి.) ఈ రుణం మంజూరుచేసే సమయంలో అంతకు ముందు తీసుకుని తీర్చని రుణాలస్థానంలో కొత్త రుణాలను చేర్చడం జరిగింది. రుణం తిరిగి చెల్లించే రోజును మరో పది సంవత్సరాలకు పొడిగించడం జరిగింది. అదే విధంగా రిలయన్స్ గ్యాస్ ట్రాన్స్‌పోర్ట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఆర్‌జిటిఐఎల్)కు. దీని అధిపతి ముఖేష్ అంబానీకు రూ. 4,500 కోట్లు రుణం మంజూరు చేసి తిరిగి చెల్లించే కాలాన్ని పదేళ్లకుపైగా పొడిగించడం జరిగింది.

ఈ పారుబకాయిలు ప్రజలకు రెండు రకాలుగా నష్టాలను కలిగిస్తాయి. మొదటిగా, బ్యాంకులు ఈ విధంగా పారుబకాయిలను రద్దు చేయవలసి వస్తే వారు డిపాజిట్ల పై చెల్లించే వడ్డీకి, ఇచ్చిన రుణాలపై పొందే వడ్డీకి ఉన్న బేధాన్ని పెంచుకోవలసి వస్తుంది. అంటే మన డిపాజిట్లకు తక్కువ వడ్డీ చెల్లిస్తారు. మనం తీసుకునే గృహ రుణాలలాంటి వాటిపై వడ్డీ ఎక్కువగా తీసుకుంటారు. రెండోది, ప్రభుత్వ బ్యాంకు గనక ఈ విధానాల వలన నష్టాలపాలయితే ప్రభుత్వం వాటిని నష్టాలనుండి బయట పడేయడానికి వాటికి తిరిగి పెట్టుబడులు సమకూర్చవలసి ఉంటుంది. ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వ రంగ బ్యాంకులను కాపాడవలసిన బాధ్యత ప్రభుత్వానిదే అయినా, ఇచ్చిన అప్పులను వాపసు చేయడంలో ఏమాత్రం ఆసక్తిని కనపరచకుండా పెట్టుబడులను తిరిగి పొందడం అంటే బడా వ్యాపారులను అప్పులెగ్గొట్టేందుకు సహకరించే విధానమే. అంటే విజయ మాల్యా, నీరవ్ మోడీ లాంటి అప్పులను ఎగ్గొట్టే బడా కార్పొరేట్లకు మన డబ్బును సబ్సిడీగా ఇవ్వడానికి ఉపయోగించడమే.

అంతకంటే ఘోరమయినది ప్రతిపాదించబడిన ఫైనాన్స్ రెసొల్యూషన్ అండ్ డిపాజిట్ ఇన్సూరెన్స్ బిల్. ఈ బిల్ డిపాజిట్ చేసుకున్న డబ్బును బ్యాంకుల కార్యక్రమాలలో ఏర్పడ్డ నష్టాలను పూడ్చుకునేందుకు చట్టబద్ధత కల్పిస్తుంది. బ్యాంకులు గనక దివాళా తీస్తే ఆ నష్టాలను డిపాజిట్ దారుల సొమ్ముతో బయటపడే వీలు కల్పిస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే మోడీ ప్రభుత్వం ఆర్థిక రంగంలో ఘోరాతి ఘోరంగా విఫలమయింది.

**మోడీ పాలన ఆర్థిక మంత్రం : కార్మికులచే పన్ను కట్టించు(కక్కించు), కార్పొరేట్లను గ్రామీణ ధనికులను మెక్కపెట్టు 2013-14**

యూపిఎ పాలన చివరి సంవత్సరం కేంద్ర ఎక్సైజ్ పన్ను రూ.169,455 కోట్లు ఉండింది. ఇది 2014-15లో పన్ను రూ.188,128 కోట్లకు చేరింది. 2015-16లో రూ.2,88,073 కోట్లకు, 2016-17లో మరింతగా పెరిగి ఏకంగా రూ.381,756 కోట్లకు చేరింది. 2017-18లో జిఎస్‌టి వచ్చేసింది. జిఎస్‌టిలోని కేంద్ర వాటా దీనికి అదనంగా కలుపుకంటే పరోక్ష పన్నులు, సేవాపన్నులు మొత్తం గణనీయంగా ఉంటుంది. ఇదే సమయంలో కార్పొరేట్లపై పన్ను నామమాత్రంగా పెరిగింది. 2013-14లోఉన్న రూ.396,678 కోట్లనుండి 2014-15కి రూ. 453,228 కోట్లకు పెరిగింది. 2016-17 ఈ మొత్తం రూ 484,924 కోట్లకు చేరింది. మరో మాటలో చెప్పాలంటే మోడీ పాలన కార్మికుల నడ్డి విరిచింది. పరోక్ష పన్నులు విపరీతంగా పెంచి కార్పొరేట్లపై వేసే ప్రత్యక్ష పన్నులను నామమాత్రంగా పెంచింది. ఆస్తి పన్ను రద్దు చేసింది. వార్షిక ఆదాయం రూ 250 కోట్లు లేదా అంతకంటే తక్కువ ఉన్నవారి నికర ఆదాయాలపై పన్ను 30% నుంచి 25%నికి తగ్గించింది. మరెన్నో ఇతర లాభదాయకమయిన సౌకర్యాలను సమకూర్చి పెట్టింది. మోడీ పద్ధతులు-చర్యలు రాజకీయ పార్టీలకు నిధులు సమకూర్చడంలో పారదర్శకతకు పూర్తిగా విరుద్ధమయినవి. రాజకీయ పార్టీలు దాతల పేరు బహిర్గత పరచాల్సిన పని లేకుండా అపరిమిత నిధులు సమకూర్చుకోవచ్చన్న ఒక అంశాన్ని ఆర్థిక బిల్లులో చేర్చింది. రాజకీయ పార్టీలు విదేశీ నిధులను సమకూర్చుకోవచ్చని వెనకటి తేదీ నుండి అమలు అయ్యే విధంగా చట్టం చేసింది. ఇందువలన అతిగా లాభ పడేది బిజెపినే. ఆతరువాత కాంగ్రెస్. కార్పొరేట్ రంగానికి ఉదారంగా పన్నులలో రాయితీలు కల్పిస్తూ సాధారణ ప్రయోజనాలు సమకూరుస్తూ, అంతకంటే ఉదారంగా గ్రామీణ పట్టణ ధనికులకు మోడీ లాభాలను చేర్చి పెట్టింది. ఫలితంగా

ప్రభుత్వ ఆస్తులను అమ్మి ఆర్థిక లోటు పూడుస్తున్నది. 2017–18 లో ప్రభుత్వ ఆస్తులు అమ్మి బడ్జెట్ కాపిటల్ పద్దుల కింద వచ్చే వసూళ్లు రూ.75,000 కోట్లు అని అంచనాలు వేసుకుంటే 2018–19 బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి తాను లక్షలకోట్ల రూపాయలు ప్రభుత్వ రంగ ఆస్తులను అమ్మగలిగానని గర్వంగా చెప్పుకున్నారు. అంటే రాబోయే రోజులలో ప్రభుత్వ ఆదాయాలు తగ్గి మరింత తక్కువ ప్రజా ప్రయోజన పథకాలు అమలు చేయ గలుగుతారన్నమాట. పేదలకు వ్యతిరేకంగాను, ధనికులకు అండగాను ఉన్న మోడీ ప్రభుత్వ విధానాల వలన ప్రజలవద్ద ఉన్న సంపదలతో అసమానతలు మరింతగా పెరిగాయి. 2014 లో మోడీ ప్రధాన మంత్రి పదవి చేపట్టారు. అప్పుడు పై 1% కుటుంబాల వద్ద భారతదేశంలోని 49% సంపద పోగుపడి ఉండేది. 2017లో ఇది పెరిగి 58శాతానికి చేరింది. 2017–18లో పై 1% ప్రజలు దేశంలోని అదనపు సంపదలో 73% పొందారు. ఫలితంగా దేశంలో పై 1% కుటుంబాలు ఇప్పుడు 60% సంపదను కలిగి ఉన్నాయి. మోడీ పాలన జుగుప్సాకరమయిన అసమానతలకు గుర్తింపుగా మిగిలింది.

♦




♦ ♦ ♦

# లాభాల వేటగాళ్లతో ప్రభుత్వం కుమ్మక్కయితే

మోడీ ప్రభుత్వం గొప్పగా చెప్పుకునే మరో విషయం ధరలపెరుగుదలను గత నాలుగేళ్లుగా దాదాపుగా అదుపుచేసిందని. దీనిని నిరూపించుకునేందుకు అధికారిక హోల్ సేల్ ధరల సూచీలను వివిధ పట్టణాల నుండి చూపుతున్నది. కానీ అసలు విషయం ఏమిటంటే గ్రామీణ భారతదేశంలో వినిమయ ధరల సూచీ ప్రకారం 2014 మే నుండి (గణాంకాలు అందుబాటులో ఉన్న) 2018 ఏప్రిల్ లోపు 21% పెరిగాయి. పట్టణ ప్రాంతాలలో వినిమయ సూచీ ప్రకారం ధరలు 17 % పెరిగాయి. వాస్తవంలో ప్రజలు చెల్లిస్తున్న ధరలను గనక పరిగణనలోనికి తీసుకుంటే పై అంకెలే హాస్యాస్పదంగా ఉన్నాయి.

ఏమయినప్పటికీ, ఈ అంకెలు గత కాలంలోని ధరలలో మార్పులను చక్కగా సూచిస్తున్నది. అయితే దీని వలన తెలియని నిజం ఏమిటంటే కొన్ని వస్తువుల ధరలు గత నాలుగేళ్లుగా ప్రత్యేకంగా ఎంత ఎక్కువగా పెరిగాయన్నదే. ఉదాహరణకి కందిపప్పు 2015 సెప్టెంబర్ –నవంబర్ నెలలలో కిలో రూ. 200 దాటింది. 2017 మొదట్లో చక్కర ధరకిలో రూ. 50 దాటింది. మోడీ అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే ఉల్లిపాయలు కిలో రూ. 100 దాటాయి. అప్పటినుండి అప్పుడప్పుడు ధరలు పెరుగుతూనే ఉన్నాయి. 2015 అక్టోబర్‌లో ఆవనూనె ధర కిలో రూ. 150 చేరింది.


కాస్త ఆదాయం ఉన్న వారికి ఈ ధరల పెరుగుదల ఒక తాత్కాలిక ఇబ్బందిగానే అనిపించవచ్చు. కానీ రోజువారీ సంపాదనతో కాలం గడిపే పేదలు వారాలు, నెలల కాలంలో వినియోగం తగ్గించుకోవడం మినహా గత్యంతరం లేదు. ప్రభుత్వం

చేయదలుచుకుంటే ఈ రకమయిన హెచ్చుతగ్గులు నివారించడానికి అనేక మార్గాలు ఉన్నాయి. మోడీ ప్రభుత్వం అటువంటివేవీ చేయదలుచుకోలేదు. పేదలు ఎన్ని కష్టాలు పడవలసి వచ్చినా. మార్కెట్‌కి వాటిని వదిలేసింది. మరో దురద ృష్టం ఏమిటంటే మోడీ ప్రభుత్వ విధానాలవలన ఒక వైపు ఆహార వస్తువుల ధరలు ఆకాశాన్ని అందుకుంటుండగా రైతులు తమ పంటలకు గిట్టుబాటు ధరలు లేక రోడ్డెక్కుతున్నారు. ఇందుకు ముఖ్య కారణం వారు ఉపయోగించే అన్ని వస్తువుల ధరలు – ఎరువులు, పురుగుమందులు, డీజిల్, పశుగ్రాసం మొదలయినవి – విపరీతంగా పెరుగుతుండడం, వారు పండించిన పంట ధరలు మార్కెట్లోగాని ప్రభుత్వం చెల్లించేవిగాని ఆ దరిదాపులలో లేకపోవడం. ఉదాహరణకి ఒక ఏడాదికింద వ్యవసాయంలో నీటి పారుదలకు ఉపయోగించే హైస్పీడ్ డీజిల్ ధర 2015–16కి 2016–17కి మధ్య 23.7 % పెరిగింది. అలాగే పశుగ్రాసం ధర 11 % పెరిగింది. మోడీ పాలనలో ధరలన్నీ విపరీతంగా పెరిగి రైతులకు అంతులేని దుఃఖాన్ని తెచ్చి పెట్టాయి.

విద్య, ఆరోగ్యం రెండూ మనిషి గౌరవంగా బతకడానికి అత్యవసరమయినవే. ప్రభుత్వం ప్రైవేటు రంగానికి అప్పచెపుతుండడంతో రోజురోజుకు వాటి ధరలు పెరిగిపోతున్నాయి. స్టెంట్ ధరలు కృత్రిమ అవయవాల ధరలు తగ్గించామని, గొంతు చించుకుని చెప్తున్నారు, కానీ మోడీ అనుసరిస్తున్న విధానాల వలన మౌలిక ఆరోగ్యం కాపాడుకోవడం మరింత కష్ట సాధ్య మవుతున్నది. వైద్యం అందుబాటులో లేకుండా పోతోంది. దానికి పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యం పైన, ఆరోగ్య బీమా పైన ఉన్న శ్రద్ధ మౌలిక వసతులు కల్పించడంలో లేదు. నీతి ఆయోగ్ నుండి వెలువడిన పథకాలను చూస్తే ప్రభుత్వ ప్రైవేటు రంగ భాగస్వామ్యమే అన్ని సమస్యలకు పరిష్కారం చూపిస్తున్నట్టు భావిస్తున్నారని అర్థం అవుతుంది. ఇది లక్షలాది ప్రజల పేదరికాన్ని, ఆపదలను పెంచే చేదు పరిష్కారం మాత్రమే. ధరల విషయంలో మోడీ ప్రభుత్వ అతి నీచమైన నమ్మక ద్రోహం చమురు రంగంలో కనిపిస్తుంది. ఒక వైపు చమురు ధరలు అంతర్జాతీయంగా తగ్గుతుండగా ఆ అవకాశాన్ని ఉపయోగించుకుని మోడీ పన్నులను పెంచి ప్రజలకు ఆ ప్రయోజనం చేకూరనీయలేదు. కొన్ని వాస్తవాలను పరిశీలించండి. ఈ ఏడు మే 22న ఢిల్లీలో డీజిల్ ధర లీటరుకు రూ. 68, అప్పటికి ఇదే అత్యధిక ధర. పెట్రోల్ రూ.76.87, ఇది కూడా అప్పటికి అత్యధిక ధరే. రెండింటిధరలూ క్రమంగా పెరుగుతున్నాయి. మిగిలిన అన్ని పట్టణాలలోనూ ఇదే పరిస్థితి ఉంది. కొన్ని చోట్ల మరింతగా కూడా పెరుగుతున్నాయి. ధరలు ఇంతగా ఎందుకు పెరుగుతున్నాయి? ప్రభుత్వం చమురు ధరలను నిర్ణయిస్తే చమురు

కంపెనీలకు నష్టాలు వస్తున్నాయి కాబట్టి చమురు కంపెనీలు తమ ధరలను తామే నిర్ణయించుకుంటున్నాయి. అని ప్రభుత్వం చెబుతోంది. కర్ణాటక ఎన్నికల సమయంలో కొన్ని రోజులు ఈ స్వతంత్ర చమురు కంపెనీలే ధరలను స్తబ్దంగా ఉంచడం జరిగిందన్న విషయాన్నీ కాసేపు మర్చిపోదాం. వాస్తవమేమిటంటే మనం పెట్రోలుకు చెల్లించే ధరలో సగానికి సగం – ఢిల్లీలో అయితే పెట్రోల్ ధరలో 48%, 59% డీజిల్‌లోను చమురు కంపెనీలకు పోతుంది. మిగిలినదంతా పన్నులే. ప్రభుత్వ లెక్కల ప్రకారమే ముడిచమురు, పెట్రోలు ఉత్పత్తుల ధరలలో కేంద్రం వాటా 2014–15 లో రూ 1.26 లక్షల కోట్ల నుండి 2016–17 లో రూ. 2.73 లక్షల కోట్లకు పెరిగింది. కిందటేడాది అంతటికి గణాంకాలు లభ్యం అయ్యాయి. అంటే కుటుంబానికి ఏడాదికి అదనపు భారం రూ. 6,000 పడిందన్నమాట. ఈ భారం పెట్రోల్ గాని డీజిల్ గాని కొన్న వారి పైనే పడింది కానీ పేదలపై కాదని ప్రభుత్వం వాదిస్తున్నది. కానీ ప్రత్యక్షంగా పెట్రోల్ డీజిల్ కొనకపోయినా ఈ ధరల పెరుగుదల వలన పెరిగిన రవాణా ధరలను ప్రతిరోజు ప్రయాణాలు చేసే పేదలు భరించవలసివస్తోంది.

♦



# పకోడీలు అమ్ముకోవడమే గతి

**నాలుగేళ్ళ మోడీ పాలన : రెండు కోట్ల ఉద్యోగాలు ఏవీ ?**

రెండుకోట్ల ఉద్యోగాలిస్తామని 2014 సాధారణ ఎన్నికల ప్రచారంలో నరేంద్రమోడీ వాగ్దానం చేసారు. పార్టీకి మోడీకి కూడా పెద్ద ఎత్తున ప్రజల మద్దతును చేకూర్చి పెట్టింది. యుపిఎ ప్రభుత్వ కాలంలో ఉద్యోగాలు లేని ఎదుగులతో ప్రజలు విసిగిపోయి ఉన్నారు. వారందరికీ మంచి రోజులు వస్తున్నాయని భావించారు. నాలుగేళ్లు గడిచిపోయాయి. మోడీ ప్రభుత్వం ఈ విషయంలో అత్యంత దారుణంగా విఫలమయింది. నిజానికి మోడీ ప్రభుత్వం ఉద్యోగాలు సృష్టించడం కాదు కదా ఉన్న ఉద్యోగాలను ఊడగొట్టింది. ఈ పూర్తి వైఫల్యాన్ని కప్పిపుచ్చేందుకు పకోడాలు అమ్ముకోవడం కూడా ఉద్యోగమే అని అంటోంది.

మోడీ ప్రభుత్వం ఉద్యోగాలు సృష్టించలేదనడానికి రుజువులు ఇవిగో కొన్నింటిని చూడండి.

- మోడీ మొదటి రెండేళ్ల పాలనలో పది లక్షల ఉద్యోగాలు ఎగిరిపోయాయని రిజర్వు బ్యాంకు అఫ్ ఇండియా అధ్యయనం చెప్తున్నది. దేశంలో మొత్తం పనులు చేస్తున్న వారి సంఖ్య 2014–15 లో 7. 7 లక్షలు తగ్గగా, 2015–16లో మరో 3.8 లక్షలు తగ్గింది. (మూలం : ఆర్‌బిఐ యొక్క కెఎల్ఈ ఎంఎస్ గణాంకాలు)
- 2016 ఏప్రిల్ నుంచి లేబర్ బ్యూరో నిర్వహించిన ఒక సర్వే ప్రకారం 2017 అక్టోబర్ చివరినాటికి గడచిన 18 నెలలలో 5.56 లక్షల కొత్త ఉద్యోగాలు ఏర్పడ్డాయి. అంటే 1.8 % వార్షిక పెరుగుదల లేదా ఏడాదికి 4 లక్షల కొత్త ఉద్యోగాలు వచ్చి చేరాయి. కానీ ఉద్యోగాలు పోయినందువలన ఈ పెరుగుదల తరుగుదలగా మారింది.

- సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ తాజా అంచనాల ప్రకారం భారతదేశ ఉద్యోగిత లేదా శ్రామిక శక్తి భాగస్వామ్యం రేటు (15 ఏళ్లకు పైబడిన వారి శాతం) 2018 మార్చి నాటికి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 40 శాతానికి పడిపోయింది. రెండేళ్ల కిందట ఇది సరాసరి 43% ఉండేది. అంటే 1.43 కోట్ల ప్రజలు పనులు కోల్పోయారు. వారు బహుశా పనులు వెతుక్కొని ఉండి ఉంటారు. లేదా నిరాశ, నిస్పృహ, భంగపాటుతో కాలక్షేపం చేస్తూ ఉండి ఉంటారు.
- సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ అంచనాల ప్రకారం నిరుద్యోగం 5%నికి చేరింది. అంటే 2 కోట్లకు చేరింది. ఇందుకు తోడు 2016లోని ప్రభుత్వ లేబర్ బ్యూరో ప్రకారం శ్రామిక శక్తిలో 35%నికి ఏడాదంతా పనులు దొరకడం లేదు. లేదా అతి తక్కువ వేతనాలకు పనులు చేస్తున్నారు. అంటే 13 కోట్ల మంది అన్నమాట.
- 2016 లేబర్ బ్యూరో రిపోర్ట్‌లో మహిళల ఉద్యోగిత మూలుగుతూనే ఉన్నది. 15 సంవత్సరాలు దాటిన మహిళలలో కేవలం 22% మాత్రమే పనిలో ఉన్నారు. ఇది ప్రపంచంలోనే అతి తక్కువ. మోడీ ప్రభుత్వం మహిళల్లో ఉద్యోగిత పెంచడానికి ఇంకా ఏ స్కీమూ ఆలోచించలేదు. నిజానికి ఈ సమస్యపై వారు చెప్పేందుకు కూడా ఏమీలేదు. వాళ్ళ 2014 ఎన్నికల మేనిఫెస్టో లో" "మహిళలు – దేశ నిర్మాతలు" అని ఏకంగా ప్రత్యేక భాగాన్ని రాసుకున్నారు. ఏటా 2.46 కోట్ల ప్రజలు కార్మిక శక్తికి అదనంగా చేరుతున్నారు. అందులో 44% పనిని కోరుకుంటుంటారు. అంటే 1.15 కోట్లు పనిచేయడానికి ఎదురుచూస్తుంటారు. అంటే 15 ఏళ్ళు దాటిన మిగిలిన యువశక్తి విద్యార్థులుగా లేదా ఇంటిపని చేసే మహిళలుగా ఉంటారు. వారందరికీ పని కల్పించే బదులు మోడీ ప్రభుత్వం వారినందరినీ ఉద్యోగాల వేటలో ఊరూవాడ తిరగమని పంపిస్తున్నది.

అందుకే రైల్వేస్ లక్ష ఉద్యోగ ఖాళీలున్నాయని ప్రకటిస్తే రెండు కోట్ల దరఖాస్తులు వచ్చి చేరాయి. 2015లో 368 ఖాళీలు కోసం ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్యూన్ ఉద్యోగం కోసం ప్రకటన ఇస్తే 23 లక్షలమంది దరఖాస్తు చేసుకున్నారు. అలాగే హర్యానాలో కోర్టులో ఉన్న 9 ఖాళీలకు గాను 18,000 దరఖాస్తులు వచ్చాయి. రాజస్థాన్‌లో 18 పోస్టులకు గాను 12,000 మంది దరఖాస్తు చేసుకున్నారు. అనేక పరిశ్రమలు సేవా రంగాలలో నేడు కార్మికులను దేశీయంగా తగిన గిరాకీ లేక లేదా ప్రపంచ మార్కెట్లలో గిరాకీ లేక ఇంటికి పంపించడం జరుగుతున్నది. ఇందులో

టెలికం, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, వస్త్ర, తోలు, వజ్రాలు, బంగారం మొదలైన పరిశ్రమలు ఉన్నాయి . ఈ మధ్యనే ఐఐపి ప్రకటించిన పారిశ్రామిక అభివృద్ధి సూచి పారిశ్రామిక అభివృద్ధి కుంటుబడుతున్నాదని తెలియచేసింది.

పరిశ్రమలకు రుణపరపతి పరిశ్రమలు ఎలా పెరుగుతున్నాయో చెప్పే ఒక సూచి. దీని ప్రకారం దేశంలో గత 54 సంవత్సరాలలో ఎన్నడూ లేనంత కింది స్థాయిలో రుణ పరపతి ఉంది. ఇవన్నీ ఉద్యోగిత తగినంతగా లేదని, సమీప భవిష్యత్ లో ఉండదని నిర్ధారిస్తున్నాయి. ఇందుకు తోడుగా వ్యవసాయ రంగం అంతులేని సంక్షోభంలో కొనసాగుతూనే ఉంది. పడిపోతున్న ఆదాయాలు, పెరుగుతున్న ధరలు వీటిని మరింత మందిని ఇముడ్చుకునే శక్తి లేకుండా చేసాయి. నిజానికి రైతులు వ్యవసాయం వదిలి అసంఘటిత రంగంలో ఉద్యోగాల వేటలో పడ్డారు. ఇవన్నీ ఏమి చూపిస్తున్నాయంటే మోడీ రెండుకోట్ల ఉద్యోగాలిస్తాననడం ఒక ఎన్నికల ప్రహసనం మాత్రమే. ఆయన ప్రభుత్వం నిజమయిన ఏ చర్యను తీసుకోలేదు లేదా కొత్త ఉద్యోగాలు సృష్టించేందుకు ప్రత్యేక దృష్టి కూడా పెట్టలేదు. అబద్దపు వాగ్దానాలు లక్షలాది కుటుంబాల కడుపులు నింపవు కదా!



◆ ◆ ◆

# మోడీ పాలనలో మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతున్న అవినీతి

తాను అవినీతికి పాల్పడనని అలాగే ఎవరు పాల్పడినా సహించనని 2014 ఎన్నికల ప్రచారంలో నరేంద్ర మోడీ, గర్వంగా ప్రకటించారు. తనను ప్రజలు తమ ఇనప్పెట్టెకు విధేయంగా ఉండే కాపలాదారునిగా ఎన్నుకోవాలని కోరారు. తాను ఎవరు ఒక్క పైసా కూడా దోచుకోకుండా చూస్తానని అన్నారు. వంద రోజులలో నల్లధనాన్ని వెనక్కు తెస్తానని ప్రతి పేద కుటుంబానికి రూ 15 లక్షలు చొప్పున వారి బ్యాంకు ఖాతాలలో జమ చేస్తానని వాగ్దానం చేసారు. అయితే గత నాలుగేళ్లుగా ఇవన్నీ ఛలోక్తులుగా మిగిలిపోయాయి. ఈ నాలుగేళ్లలో ప్రభుత్వం చేసినదల్లా అవినీతికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలను, ఉన్న చట్టాలను, విమర్శలను నిర్వీర్యం చేయడం రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకుని వారిపై ఎక్కుపెట్టడం, తన అనుకూలురను కాపాడుకోవడం.

## అవినీతికి వ్యతిరేకంగా చట్టాలు

గత మూడేళ్లుగా అవినీతికి వ్యతిరేకంగా తయారయిన మూడు కీలక బిల్లుల గతి చూస్తే మోడీ ప్రభుత్వం, ప్రభుత్వ కార్యాలయాలలోఈ సమస్యకి ప్రాధాన్యత నివ్వడం కేవలం కపట నాటకమే అని అర్థం అవుతుంది. ఇందులో మొదటిగా చెప్పుకోవలసింది అన్నా హజారే ఉద్యమ ఫలితం, ఎక్కువగా చర్చలు జరిగిన లోక్‌పాల్ బిల్. ఈ బిల్‌కి గతేంటి? నాలుగేళ్లు గడిచాయి. ఇంకా లోక్పాల్‌ని నియమించవలసి ఉంది. అధికారంలోకి వచ్చిన కొత్తలో, లోక్‌పాల్ కమిటీలో ప్రతిపక్ష నాయకునికి కూడా భాగస్వామ్యం ఉండాలని, లోక్ సభలోని ప్రతిపక్షంలో 10% సీట్లు వచ్చిన వారు లేరని, అందువలన ఆ స్థానానికి ఎవరినీ పెట్టలేకపోతున్నామని బిజెపి

చెప్పుకొచ్చింది. ఇది కుంటిసాకు మాత్రమే. ఎందుకంటే, అధికారేతర మెజారిటీ కాలిగిన పార్టీ నాయకున్ని లోక్‌పాల్ సెలెక్ట్ కమిటీలో పెట్టుకునేటట్టు చట్టానికి సవరణ చేస్తే సరిపోతుంది. కానీ ప్రభుత్వం ఈ సవరణ చేయడానికి ఎంతో సమయం తీసుకుంది. చివరకు 2015 డిసెంబర్‌లో పార్లమెంటరీ సెలెక్ట్ కమిటీ తన రిపోర్ట్‌ను సమర్పించింది. అయితే అదింకా చట్టం కావడానికి నోచుకోలేదు. ప్రభుత్వం అధికారంలో కొనసాగుతూనే ఉంది. గుజరాత్ లో మోడీ ముఖ్య మంత్రిగా ఉండగా లోకాయుక్తాను నియమించాలని కోర్టు బలవంతం చేస్తేగాని నియమించలేదని తెలిసిన వారికి ఇది ఆశ్చర్యం కలిగించదు. అవినీతిని నిరోధించే మరో కీలక చట్టం అవినీతి నిరోధక చట్టం. దీనిని సవరించి నీరుగార్చడం, కోరలు తీయడం జరిగింది. అందులో ఒక సవరణ వలన ప్రభుత్వ సేవలలో ఉన్న వారిని శిక్షించడానికి, దర్యాప్తు చేయడానికి కూడా లోక్పాల్ లేదా లోకాయుక్తల అనుమతి తీసుకోవాలి. ఇందువలన అవినీతి అధికారులపై చట్టపరమయిన చర్యలు తీసుకోవడం మరింత కష్టమవుతుంది. లోక్పాల్‌ని అసలు నియమించక పోవడంతో ఇక అవినీతి అధికారులపై చర్యల ప్రసక్తే లేకుండా చేసింది ఈ ప్రభుత్వం. రాష్ట్రాలలో లోకాయుక్తలను నియమించక పోవడానికి కూడా ఇది వర్తిస్తుంది.

మూడో చట్టం, విజిల్ బ్లోయర్స్ ప్రొటెక్షన్ యాక్ట్. అంటే అవినీతిని గురించి ముందే హెచ్చరించిన వారి రక్షణ కోసం చట్టమన్నమాట. 2014లో ఇది చట్ట రూపం దాల్చింది. అయితే మోడీ ప్రభుత్వం దీనికి కూడా సవరణలు చేసింది. ఈ సవరణలు ఎవరయినా అవినీతి అధికారిపై ఫిర్యాదు చేయాలంటే వారిని నిరుత్సాహ పరిచే విధంగా ఉన్నాయి. దేశ రక్షణ, జాతి ప్రయోజనాలు, మరే ఇతర రాజ్య "ఆర్థిక ప్రయోజనాలు", "వ్యూహాత్మక ప్రయోజనాలు" ఈ చట్ట పరిధి నుంచి మినహాయించడం జరిగింది. తద్వారా అవినీతికి అవకాశం ఉన్న అన్ని రంగాలనుదీని పరిధి నుండి తప్పించింది. పైగా "అధికార రహస్యాల చట్టం" కింద హెచ్చరిక చేసిన వారికి 14 ఏళ్ళు జైలు శిక్ష వేస్తూ, వారికి రక్షణ కల్పించడాన్ని బలహీన పరిచారు. ఈ మార్పులతో అవినీతి గురించి తెలిసినా దానిని నివేదించడానికి ఎంతో ధైర్యం కావలసి ఉంటుంది. ప్రభుత్వం సమాచార హక్కు చట్టంలో ఉన్న మినహాయింపులే ఇందులో కూడా ఉన్నాయని చెబుతున్నది. కానీ ఈ వాదనలో నిజం లేదు. సమాచార హక్కు ప్రజలకి సంబంధించిన విషయాలు తెలుసుకోవడానికి సంబంధించినదయితే, ఈ చట్టం, చట్టంలో నిర్వచించిన ఒక సమర్థుడయిన అధికారి విషయాలను బహిర్గతం చేసేందుకు ఉపయోగిండానికి తయారు చేయబడింది.

అందువలన ఏ రకమయిన దేశ రక్షణ ఇందులో రాజీపడవలసిన అవసరం రాదు.

## నల్ల ధనం

ఇక నల్లధనం గొప్పలగురించి తెలుసు కుందాము. అమిత్‌షా రూ. 15లక్షలు పేదలకు ఇవ్వడం అన్నది ఒక ఎన్నికల చమత్కారంలో భాగంగా తేల్చేసారు. ఇక మనం ఆ ఇద్దరి మాటలలో నిజాయితీ ఎంతో వేరే చెప్పాలా? అలాంటి విపరీత వాగ్దానాలను వదిలేసినా ప్రభుత్వ పనితీరు దయనీయంగా ఉంది. నల్ల ధనం బయటినుండి తీసుకురాడం కాదు కదా, నల్ల ధనం గల వారికి రక్షణ కల్పిస్తూ, దేశం బయటనున్న బ్యాంకులనుండి సేకరించిన వారి పేర్లను బయట పెట్టడానికి కూడా ఒప్పుకోవడం లేదు. పనామా పేపర్స్ లాంటి స్వతంత్ర సంస్థలు నల్లధనం చిట్టా బయట పెట్టినా ప్రభుత్వం నోరు మెదపడం లేదు ఏ రకమయిన చర్యలూ తీసుకోవడం లేదు. ఈ మధ్యనే అంబానిగారు పన్నులు కట్టవలసిన అవసరం లేని దేశాలకు రూ 2100 కోట్లు తరలించినట్టు ఒక ఉదంతం బయటపడిన నేపథ్యంలో మోడీగారు పెదవి విప్పకపోవడం ప్రభుత్వ నిజాయితీ తేటతెల్లమవుతుంది. తన మాట నిలపెట్టుకోక పోగా, నిజాయితీగా ఉన్నట్టు కనిపించడానికి మోడీ గారు మరో నాటకానికి తెరతీసి నోట్ల రద్దు ప్రకటించారు. ఫలితం ఏమిటి? నల్ల డబ్బు దాచుకున్న వారు భయపడతారని, 3 లేదా 4 లక్షల కోట్లు నల్లధనం బయటికి వస్తుందని ప్రభుత్వం భావిస్తే 99% డబ్బులు బ్యాంకింగ్ వ్యవస్థలోకి తిరిగి వచ్చాయి. నోట్ల రద్దు ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసింది. లక్షల మంది నిరుద్యోగులయ్యారు. వేలాది చిన్న పరిశ్రమలు మూతపడ్డాయి. ఆ వచ్చిన కాస్త నల్లధనం కూడా పన్ను ఎగవేత దారులను క్షమించే పథకం వలన వచ్చినదే - ఈ పద్ధతి చాలాసార్లు ఇదివరకు కూడా ప్రయోగించడం జరిగింది. దానిని నిజాయితీగా పన్ను చెల్లించిన వారు వ్యతిరేకించారు కూడా.

## స్కాములు

ఇక సంశయాత్మక పరిస్థితులలో బయటపడిన బిజెపి నాయకుల పేర్ల చిట్టా చాలా పెద్దదే. అయితే ఎవరిమీద ఏచర్యా తీసుకోలేదు. ఒక క్షణం పంజాబ్ నేషనల్ బ్యాంకును మోసం చేసి దేశం నుంచి పారిపోయిన నీరవ్ మోడీ దావోస్‌లో ప్రధానితో కలిసి తీసుకున్న ఫోటోను గురించి మరిచిపోదాం. అది యాదృశ్చికంగా జరిగి ఉండవచ్చు. మరో యాదృశ్చిక సంఘటన మాటేమిటి? అదే అమిత్‌షా కుమారుడు జయ్ షా వ్యాపారం 16,000 రెట్లు ఒక సంవత్సరంలో, మోడీ ప్రధాన

మంత్రిగా ఉండగా పెరిగిపోవడం. యాదృశ్చిక సంఘటన అయితే బిజెపి ప్రచార మాధ్యమం మీద ఎందుకంతగా విరుచుకు పడిపోయింది? వ్యాపం స్కాంలో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శిరాజ్ చౌహన్ పాత్ర ఏమిటి? అందులోని సాక్షులు 40 మంది చనిపోవడం, సమాధానం చెప్పుకోలేని విధంగా బిజెపి నాయకులను బందీలు చేయగలగడం కూడా యాదృశ్చికమేనా? ఇక కాగ్ అనేక చీకటి వ్యవహారాలలో మునిగినవాడని చెప్పిన మోడీ అనుంగు స్నేహితుడు అమిత్ అదానీ సంగతేమిటి? ఆయనకి అనేక ప్రాజెక్టులు కట్టపెట్టబడ్డాయి. ఈ మధ్యనే షిప్పింగ్ చట్టాలు కూడా అదానిగారికోసం మార్చబడ్డాయన్న విషయం బయట పడింది.

యుపిఎ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాన్నుండి మోడీ బయటికి వచ్చి ఫ్రాన్స్‌తో 126 రఫెల్ యుద్ధ విమానాలు కొనడానికి రాఫి కంపెనీ డ సాల్ట్‌తో ఒప్పందం చేసుకున్నారు. వీటిలో ఒకదాని ఖరీదు $81 మిల్లియన్ల కాగా మొట్ట మొదటి ఒప్పందం రద్దుచేసి తిరిగి చేసుకున్నారు. ఫలితంగా 36 యుద్ధ విమానాలు ధర ఒక్కొక్కటి $243 మిల్లియన్లకి పెరిగింది. ముందు చేసుకున్న ఆ ఒప్పందంలో టెక్నాలజీ బదిలీ ఉండగా మోడీ ఒప్పందం లో విమానం ఎగరడం వరకే నిబంధన ఉంది.

2015 మే లో కాగ్ నితిన్ గడ్కారిని పూర్తి సహకార్ కార్ఖానా డైరెక్టర్‌గా ప్రమోటర్‌గా పేర్కొంది. ఈ కంపెనీ ప్రభుత్వ రుణ మంజూరు మార్గదర్శకాలకు వ్యతిరేకంగా ప్రభుత్వ రుణాలను పొందింది. లలిత్ మోడీని దేశంనుంచి తప్పించడంలో వసుంధర రాజే సింధియా, సుష్మ స్వరాజ్ పాత్ర ఏమిటి? ఎడ్యూరప్ప బిజెపి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయడం అంటేనే బిజెపి ఎంతవరకు అవినీతి రహితమో ఎవరయినా చెప్పగలరు. మహారాష్ట్రలో పంకజ ముందే, ఐసిడిఎస్ కింద పిల్లలకు ఇచ్చే ఆహారంలో కూడా దోచేశారు. ఎకనాథ్ ఖాదేసే భూస్కామ్‌లో నిందితుడు. ఆ ఇద్దరిని బిజెపి నేతలు రక్షించారు. ఇక ముకుల్ రాయ్ సంగతి సరేసరి. ఆతను తృణమూల్ కాంగ్రెస్‌లో ఉన్నన్ని రోజులు కేంద్ర ఏజెన్సీలు అతనిని శారద చిట్ ఫండ్ స్కాం, నారద స్కాము లలో నిందితుడిగా ప్రశ్నిస్తూ వచ్చాయి. కానీ బిజెపిలో చేరగానే అన్ని పాపాలు కడుగుకు పోయాయి. మమ్మల్ని వ్యతిరేకిస్తే మేం మిమ్మల్ని భ్రష్టు పట్టిస్తాం, మాతో చేతులు కలిపారా మీరు సురక్షితం అనే సంకేతాలు స్పష్టం.

◆ ◆ ◆